విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

గురువారం 23 జనవరి 2025 8 పేజీలు

కూటమికి కుట్రల బెడద

- లోకేష్ ఉప ముఖ్యమంత్రి అంటూ డిమాండ్
- పవన్‌ను ముఖ్యమంత్రిగా చూడాలంటూ నినాదం
- విచ్ఛిన్నకర శక్తుల పన్నాగాలు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 6 నెలలలోనే విచ్ఛిన్న కుట్రలు ప్రారంభమయ్యాయా...?అధికారం చేపట్టిన నాటినుండి ఇప్పటి వరకు అభద్రతాభావంలో ఉన్న ప్రజలకు ధైర్యం కల్పించే దిశగా సాగుతున్న కూటమి ప్రభుత్వాన్ని విభజించి పాలించడానికి ఏమైనా కొన్ని శక్తులు కుట్ర పన్నుతున్నాయా...? తెలుగు రాష్ట్రాల విభజన తర్వాత నేటికీ సరిగా రాజధానిని ఏర్పాటు చేసుకోలేని తరుణంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న యుద్ధానికి భంగం కలిగించడానికి కూటమిలోని కొందరు కుతంత్రాలు ప్రారంభించారా...?తాజా రాజకీయ పరిస్థితిని పరిశీలిస్తే ఈ ప్రశ్నలన్నింటికీ అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో కేవలం పేద ప్రజల బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేయడమే అభివృద్ధిగా భావించిన అప్పటి పాలకులను విమర్శించిన కూటమి నాయకులు రాష్ట్రంలో అభివృద్ధిని చూపించాలని తపన పడుతున్న సమయంలో కొన్ని శక్తులు కూటమిని విడదీయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

లోకేష్‌ను ముఖ్యమంత్రి చేయాలంటూ డిమాండ్

రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కూటమి పార్టీలోని టీడీపీకి ఏమైందో కానీ గత వారం రోజుల నుంచి కొన్ని శ్రేణులు చేస్తున్న నినాదం కూటమి పార్టీలో కుంపటి పెట్టేలా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. 2019 నుంచి 24 వరకు సాగిన వైసీపీ పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలు, పరిపాలనపై విమర్శలు ధైర్యంగా బయటకు వచ్చి చేయలేని టీడీపీ నాయకులు, శ్రేణులు 2024 ఎన్నికల ముందు వరకు అంటే ఒక రకంగా చెప్పాలంటే అజ్ఞాతంలోకి వెళ్లారని అభిప్రాయాలు ఉన్నాయి. టీడీపీని పూర్తిగా మట్టు పెట్టాలనే యోచనతో ఆ పార్టీ శ్రేణుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా అప్పటి మాజీ ముఖ్యమంత్రి, టీడిపి జాతీయ అధ్యక్షులు ►మిగతా 2లో..

వరుస చోరీలు

నిందితుల కోసం పోలీసుల జల్లెడ

విశాలాంధ్ర -కొవ్వూరు/కడియం : ప్రశాంతంగా ఉన్న కొవ్వూరు పట్టణం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఒకే రోడ్డులో ఒకేసారి ఇద్దరు మహిళల మెడలోంచి బంగారు గొలుసులు గుర్తు తెలియని దుండగులు బైక్ పై వచ్చి లాక్కెళ్లిన ఘటన స్థానికులను భయాందోళనకు గురిచేసింది.

వివరాల్లోకి వెళితే కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామానికి చెందిన నక్క ధనలక్ష్మి బ్యాంకు పని నిమిత్తం కొవ్వూరు రాగా, బ్యాంకు సమీపంలోనే దుండగులు బైక్‌పై వచ్చి ధనలక్ష్మి మెడలో ఉన్న మూడున్నర కాసుల బంగారు గొలుసు లాక్కెళ్లారు. అదే రోడ్లో కొవ్వూరు పట్టణానికి చెందిన బర్ల లలిత అపర్ణ జిరాక్స్ కాపీల కోసం కాలేజీ రోడ్డులో నుంచి నడిచి వెళుతుండగా పంచాయతీరాజ్ కార్యాలయం సమీపంలో బైక్‌పై వచ్చిన దుండగులు లలిత అపర్ణ మెడలో నుంచి ఐదు కాసుల చైన్, కాసున్నర నల్లపూసల చైన్ లాక్కెళ్ళినట్లు బాధితులు కొవ్వూరు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ ►మిగతా 2లో..

ఎస్సీ వర్గీకరణ జాతీయ ఐక్యతకు ముప్పు

విలేకరుల సమావేశంలో
కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

విశాలాంధ్ర - కాకినాడ : దళిత విభజన, ఎస్సీ వర్గీకరణ జాతీయ ఐక్యతకు పెను ముప్పు అని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం క ఆకినాడలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణనంటూ జరిగితే భారత దేశం రెండు ముక్కలవుతుందన్నారు. ఉత్తర భారతదేశం, దక్షిణ భారత దేశంగా అవతరించడం ఖాయం అన్నారు. ఉత్తర భారతదేశంలో మాదిగలెక్కువని, దక్షిణ భారతదేశంలో మాలలెక్కువని, దళిత విభజన వల్లే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, రెండైందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు దేశం పార్టీ పుట్టుకతోనే దళితులపై పడ్డారని, ఒక్కటిగా కలిసివున్న మాల, మాదిగలను ఎలాగైనా వేరు చేయాలని కుట్రలు పన్నారని అన్నారు. యుపీ, తమిళనాడు, కేరళలో లేని ఎస్సీ వర్గీకరణపై ఏపీలో ఏక సభ్య కమిషన్ వేయడం తప్పు అని, దీని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. అమృత రావు సత్యాగ్రహం, రైతులు త్యాగాలు, ఎన్నో పోరాటాలు, ఎందరో బలిదానాలు, కాంగ్రెస్ పార్టీ, ఇందిరాగాంధీ కృషి వల్ల విశాఖ ఉక్కు వచ్చిందని, దీనిపై కార్పొరేట్ల కన్ను పడిందని పేర్కొన్నారు. దేశ జనాభాలో 25 శాతం వున్న ఎస్సీ, ఎస్టీలకు బ్యాంకులు ఇస్తున్న అప్పుల్లో 1 శాతం కూడా వారికి ఇవ్వడం లేదని చింతామోహన్ వాపోయారు.

ఇళ్ళ స్థలాల హామీని నిలబెట్టుకోవాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ఇళ్ళు లేని నిరుపేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ళ స్థలాలు ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం హామీ ఎలాంటి కాలయాపన లేకుండా త్వరితగతిన నెరవేర్చేందుకు చర్యలు చేపట్టాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కపర్థి భవనంలో ఇళ్ళ స్థలాల అర్జీ దారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ గూడు లేని నిరుపేదలకు సొంత ఇంటి కల నెరవేర్చడానికి కూటమి ప్రభుత్వం పూనుకోవడం హర్షణీయమన్నారు. సొంత గృహాలు లేని నిరుపేదలు అద్దెలు కట్టలేక తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారని, తక్షణమే పేదల ఇళ్ళ స్థలాలు హామీ నెరవేర్చాలని భీమారావు డిమాండ్ చేశారు.

సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో పట్టణంలో ఎన్నో పోరాటాలు నిర్వహించి వందలాది మంది ఇళ్ళు లేని నిరుపేదలకు ఇళ్ళ స్థలాలు ఇప్పించిన ఘనత సీపీఐకుందన్నారు. ప్రస్తుతం సొంత ఇళ్ళు లేని పేదలతో ఇళ్ళ స్థలాల దరఖాస్తులు పూర్తి చేయించి అధికారులకు సమర్పిస్తున్నామన్నారు. పేదలకు స్థలాలు ►మిగతా 2లో..

దేవాదాయ భూముల పరిరక్షణకు సమష్టి కృషి

కలెక్టర్ అధ్యక్షతన భూ పరిరక్షణ కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : జిల్లాలో దేవాదాయ భూముల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. కలెక్టర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో భూ పరిరక్షణ కమిటీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవడం, ఉన్న భూముల పరిరక్షణ, లీజుదారుల నుంచి లీజు మొత్తాలను వసూలు చేయడం తదితర అంశాలపై దృష్టి సారించాలని నిర్ణయించారు. జిల్లాలో 25 మండలాల్లో దేవాదాయ శాఖకు సంబంధించిన భూములను మండలాల వారీగా సమగ్ర నివేదికను తయారు చేసి శుక్రవారం నాటికల్లా వివరాలు సమర్పించాలని కలెక్టర్ దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నివేదికలో మండలాల్లో ఉన్న దేవాదాయశాఖ మొత్తం భూమి (సర్వే నెంబర్లతో), అన్యాక్రాంతమైన భూమి, లీజుకిచ్చిన భూమి, ఖాళీగా ఉన్న భూమి, సమాచారాన్ని పొందుపర్చాలని ఆదేశం చారు. దీని ఆధారంగా రెవిన్యూ పరంగా చేయవల్సిన ప్రక్రియను

సంబంధిత రెవిన్యూ డివిజనల్ అధికారి, మండల తహశీల్దార్లకు తెలియపర్చాలని తెలి పారు. రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ భూముల పరిరక్షణకు సూచించిన మార్గదర్శకాలను సంబంధిత శాఖ అధికారులు అధ్యయనం చేసి దేవాదాయ భూముల పరిరక్షణకు సమష్టిగా కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, అడిషనల్ ఎస్పీ ఎన్.సూర్య చంద్రరావు, డిఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనరు వి. హరి సూర్యప్రకాష్, ఆర్డీవోలు అచ్యుత అంబరీష్, ఎంవి.రమణ, నగరపాలక సంస్థ కమిషనరు ఎ.భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు నియోజకవర్గంలో

రూ.100 కోట్లతో పనులు

జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ రామానాయుడు

విశాలాంధ్ర - పాలకొల్లు : పాలకొల్లు నియోజక వర్గంలో కేవలం 6 నెలల కాలంలో, 60 గ్రామాలలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర జలవన రుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు.

రానున్న కాలంలో దశలవారీగా అన్ని పనులు రెట్టించిన ఉత్సాహంతో పూర్తి చేస్తామని మంత్రి ప్రకటించారు. బుధవారం యలమంచిలి మండల పరిధిలోని, ఊటాడ, యలమంచిలి, అడవిపాలెం గ్రామాల్లో రూ.1కోటి రూపాయల ప్రభుత్వ నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ►మిగతా 2లో..

ఉచిత పశు వైద్య శిబిరాల జాడేది ?

విశాలాంధ్ర- పాలకోడేరు : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పశు రైతుల కోసం ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించాలని అన్ని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. తదనుగుణంగానే పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రభుత్వ సూచనల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 31 వరకు ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించాలని, ముఖ్యంగా పశు ఆరోగ్య శిబిరాల్లో పశువులకు వైద్య చికిత్సలు, గర్భకోశ వ్యాధుల చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ యాజమాన్యంపై రైతులకు అవగాహన నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ పాలకోడేరు మండలంలో సంబంధిత పశుసంవర్ధక శాఖ ఏ గ్రామంలో ఎక్కడెక్కడ ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారో స్థానిక మీడియా ప్రతినిధులకు తెలియచేయకపోవడం సందేహాలకు తావునిస్తుంది. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేసే మీడియాకు ఇలాంటి ప్రజలకు ఉపయోగకరమైన శిబిరాల గురించి తెలియజేయక పోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. స్థానిక మీడియా ద్వారా రైతులను చైతన్యపరిచే విధంగా జాగ్రత్త తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు పదో తరగతి కీలకం

విశాలాంధ్ర – ఉంగుటూరు : ప్రతి విద్యార్థికి జీవితంలో పదో తరగతి కీలకమని ఎంపీడీవో రాజ్ మనోజ్ అన్నారు. ఉంగుటూరు మండలం బొమ్మిడి జడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల సన్నద్ధతపై ప్రేరణ కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించి వాటిని నివారించడానికి ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలకు బాటలు వేసుకోవాలని తెలియజేసారు. అనంతరం పాఠశాల కిచెన్ గార్డెన్ను, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, ఉపాధ్యాయులు, గుదే శ్రీనివాసరావు, దుర్గా లక్ష్మీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

24న విద్యుత్ సరఫరా కట్

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండలం గొల్లగూడెం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఈనెల 24వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేద్కర్ తెలిపారు. ఆరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట సరఫరా ఉండదని చెప్పారు. సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎల్ఐసి ఉద్యోగుల సంఘానికి గుర్తింపు ఇవ్వాలి

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం: అఖిల భారత జీవిత బీమా ఉద్యోగుల సంఘానికి గుర్తింపు ఇవ్వాలని , ఎల్.ఐ.సి.లో క్లాస్ 3, క్లాస్ 4 ఉద్యోగుల నియామకాన్ని సత్వరమే చేపట్టాలని కోరుతూ బుధవారం స్థానిక జీవిత బీమా సంస్థ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో ఉద్యోగులు నినాదాలు చేశారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం కార్యదర్శి సొలస సత్యనారాయణ మాట్లాడుతూ తమ అసోసియేషన్కు గుర్తింపు నివ్వాలని, 3 మరియు 4 తరగతుల ఉద్యోగుల నియామకాన్ని చేపట్టాలని కోరుతూ ఉద్యోగులు ఆందోళన కార్యక్రమాలు ప్రారంభించినట్టు తెలిపారు. సభలో అధ్యక్షులు తోట పద్మారావు, ధనరాజు, సాయిరాం, మహంకాళి తదితరులు పాల్గొన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు గరికిపాటి బాపయ్య శర్మ, యూనియన్ గుర్తింపు ఆవశ్యకతను సభ్యులకు వివరించారు.

బాలికలకు తోడ్పాటు అందించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: ఆడపిల్లలు ప్రశాంత మైన సురక్షిత వాతావరణంలో పెరిగేందుకు రక్షణగా నిలుస్తూ, వారి విద్యకు, అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం వహించేలా ప్రతి ఒక్కరు తోడ్పాటునివ్వాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. బేటి బచావో బేటి పడావో కార్యక్ర మంలో భాగంగా జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జువ్వలపాలెం రోడ్డులోని మహాత్మ గాంధీ విగ్రహం నుండి అల్లూరి సీతా రామరాజు విగ్రహం వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. తొలుత మహాత్మాగాంధీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, భీమవరం శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనం తరం బైక్ ర్యాలీని స్థానిక శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు జెండా ఊపి ప్రారంభించగా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా బైక్ ను డ్రైవ్ చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లలకు సమాజంలో అన్ని రంగాలలో ప్రాతినిధ్యం కల్పిస్తూ ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వారు చదువుకుని సుశిక్షితులు అవ్వాలని ఆమె కోరారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయించి ఆడపిల్లలను మొగ్గలోనే తుంచేసేలా భ్రూణ హత్యలకు పాల్పడడం హేయమైన చర్యగా అభివర్ణిం చారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజ నేయులు మాట్లాడుతూ ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందు ఉండేలా ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్ర మంలో జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అధికారి సుజాత రాణి, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారా యణ, వైద్యశాఖ డిపిఎంఓ ధనలక్ష్మి, గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసి రెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్లు కె.నాగేశ్వరరావు, సంఘ సేవకులు కంతేటి వెంకటరావు, స్థానిక నాయకులు ఇందుకూరి రామలింగరాజు, చిన్న మల్ల చంద్రశేఖర్, సిడిపిఓలు, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, కళాశాల విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

నిలబెట్టుకోవాలి

(1వ పేజీ తరువాయి)

దక్కేవరకు సీపీఐ పోరాడుతుందన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. సీతారాంప్రసాద్, సికిలే పుష్పకుమారి, పట్టణ నాయకులు వద్దాది మేరీ, ఎన్. నాగలక్ష్మి, దాస్యం రాము తదితరులు మాట్లాడారు.

ఇళ్ళ సాధన కమిటీ ఏర్పాటు

తాడేపల్లిగూడెంలో ఇళ్ళు లేని నిరుపేదలతో పట్టణ ఇళ్ళ స్థలాల సాధన కమిటీని ఎన్నుకున్నారు. తాడేపల్లిగూడెం పట్టణ ఇళ్ళ స్థలాల సాధన కమిటీ కన్వీనర్గా మండల నాగేశ్వరరావు, సభ్యులుగా బొక్కా స్వర్ణకుమారి, జె. చినసీత, నార్ల వెంకటలక్ష్మి, బుట్టా అనసూయ, కొడవలి గంగరాజు, ఎం. ప్రసన్న, కర్రి సత్యవతి, వద్దాది మేరీ, ఎన్. నాగలక్ష్మి, కె. ఎస్తేరు రాణి, ప్రసన్న కుమార్, వెంకటేష్ ఎన్నికయ్యారు.

కుట్రల బెడద (1వ పేజీ తరువాయి)

చంద్రబాబును స్కిల్ స్కాం కేసు పేరుతో అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలులో పెట్టారు. ఆ సమయంలో రాష్ట్రంలో టిడిపి తిరిగి ఉనికి సాధిస్తుందా? అధికారంలోకి రావడం మళ్ళీ సాధ్యమేనా? ఇలాంటి ఆందోళనకరమైన ప్రశ్నలు టిడిపి శ్రేణులలో మెదిలాయి. ఒకవైపు అప్పటి ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో అమలు చేసిన నవరత్నాలు, ఊదరగొట్టిన ప్రచారం దెబ్బకు టిడిపి ముడుచుకుపోయిందని అభిప్రాయాలు ఉన్నాయి. ఇలాంటి తరుణంలో రాష్ట్రంలో వైసీపీని గద్దె దించడానికి యువ నాయకుడు లోకేష్ యువగళం పేరుతో రాష్ట్రం మొత్తం చేసిన పాదయాత్ర ఆ పార్టీ శ్రేణులకు ఊపిరి పోసింది. అదే సమయంలో చంద్రబాబు అరెస్టు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్వచ్ఛందంగా టిడిపికి మద్దతు ప్రకటించడం,వైసీపీ నాయకుల వెన్నులో వణుకు పుట్టించింది. ఫలితంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని కలుపుకొని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో ఎవరు ముఖ్యమంత్రిగా ఉండాలి? ఎవరెవరు మంత్రులుగా ఉండాలి అన్న విషయం కూటమి నాయకుల సంప్రదింపుల తర్వాతనే పదవులకు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ తరుణంలో తాను ఉప ముఖ్యమంత్రి కావాలని లోకేష్ ఏ సభలలోనూ మాట వరసకైనా ఆకాంక్షించలేదు. ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ను తాను సోదర భావంతో సపోర్ట్ చేసుకుంటూ దిగ్విజయంగా ప్రభుత్వాన్ని నడుపుతున్న తరుణంలో లోకేష్ ఉప ముఖ్యమంత్రి కావాలంటూ కొంతమంది డిమాండ్ చేయడం రాజకీయ వర్గాలను సర్వత్రా ఆలోచింప చేస్తోంది. చంద్రబాబుకు వయసు మీద పడుతున్న తరుణంలో టిడిపికి రాష్ట్రంలో దిశా నిర్దేశం చేయాల్సిన నాయకుడికి అనుభవం అవసరమని అందుకే పవన్ కళ్యాణ్ కు ఉప ముఖ్యమంత్రి పగ్గాలు ఇవ్వాలని తాము కోరుతున్నామని టిడిపికి చెందిన కొంతమంది యువ నాయకులు చెబుతున్నారు. అదే నిజమైతే డిమాండ్ రూపంలో కాకుండా క్రియాశీలక సమావేశాలలో అభిప్రాయాలను అధిష్ఠానానికి చేరవేయాల్సింది పోయి, బహిరంగంగా డిమాండ్ చేయటం,పత్రికా విలేకరుల సమావేశాలు నిర్వహించడం సర్వత్రా చర్చకు తావిస్తోంది.

పవన్ను ముఖ్యమంత్రిగా చూడాలంటూ నినాదం

రాష్ట్రంలో కొంతమంది టీడీపీ నాయకులు,శ్రేణులు కోరుకున్నట్టు లోకేష్ ఉప ముఖ్యమంత్రిగా చేయాల్సివస్తే ఇప్పటికే ఉపముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ ను రాష్ట్ర ముఖ్యమంత్రిగా తాము చూడాలని కోరుకుంటున్నామని జనసైనికులు నినాదాలు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వానికి చెందిన మంత్రి లోకేష్ ఉప ముఖ్యమంత్రి కావడానికి తాము వ్యతిరేకం కాదని ఆరు నెలల పాటు ఉపముఖ్యమంత్రిగా చేసిన పవన్ కళ్యాణ్ కు భవిష్యత్తులో రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేయాల్సిన అవసరం ఉన్నందున ఆయనకు ఇప్పుడే ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించాలని జన సైనికులు డిమాండ్ చేస్తున్నారు.

పార్టీల మధ్య చిచ్చుకు కుతంత్రాలు

2024 ఎన్నికలలో పోటీ చేసి అధికారాన్ని సాధించుకున్న కూటమిలోని టిడిపి, జనసేన, బిజెపిల ఐక్యతను చెడగొట్టడానికి పార్టీల మధ్య చిచ్చులు పెట్టడానికి జరుగుతున్న కుతంత్రాలుగా లోకేష్ ఉప ముఖ్యమంత్రి నినాదం సాగుతోందని పలువురు విమర్శిస్తున్నారు. ఈ నినాదాలు రాజకీయ ప్రయోజనాల కోసమా..? లేక రాష్ట్రంలో కూటమి విచ్ఛిన్నం కోసమా..? అని అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. లోకేష్ ఉపముఖ్యమంత్రి కావాలనే నినాదం బయటకు వచ్చిన తర్వాతే జనసైనికులు కూడా వారికి తగిన రీతిలో స్పందిస్తూ పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలని డిమాండ్ పెంచుతున్నారు. వీలైనంత త్వరగా కూటమి ప్రభుత్వంలోని రాజకీయ పార్టీల అధినేతలు ఈ డిమాండ్లకు ఫుల్ స్టాప్ పలకకపోతే కూటమిలో చిచ్చు రేగడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించండి

విశాలాంధ్ర-కైకలూరు: ప్రజలందరూ సీసీ కెమెరాల ఏర్పాటుకు సహాయ సహకారాలు అందించాలని పట్టణ సీఐ పి. కృష్ణ, ఎస్.ఐ.లు డి. వెంకట్ కుమార్, ఆర్. శ్రీను కోరారు. దొంగతనాలు, ఇతర నేరాలను నిరోధం చాలన్న ఉద్దేశంతో కైకలూరు పట్టణ సిఐ పి.కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం కైకలూరు పోలీస్ స్టేషన్లో కైకలూరు పట్టణంలో ఉన్న గోల్డ్ షాపు యజమానులతో సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి సమావేశం నిర్వహించారు. నేర నిరోధంలో సీసీ టీవీ ఉపయోగిత గురించి వివరించి, అన్ని బంగారు దుకాణాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బంగారు దుకాణాల యజమానులు, కైకలూరు పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కైకలూరు పట్టణ ఎన్జీవో కాలనీలో డి.సి.ఎస్. రాజు సహకారంతో బుధవారం రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

చెత్త తొలగింపు

విశాలాంధ్ర-కైకలూరు: మండలంలోని కోరుకొల్లు గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి, కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ సూచనలతో కోరు కొల్లు రహదారిలో జేసీబీతో చెత్త తరలించే కార్యక్రమాన్ని నిర్వహిం చారు. రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు (రాజీ), తెలుగుదేశం పార్టీ నాయకులు వీరాబత్తిన సుధ,జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్ (బాబి),బోడావుల ఎలీషా రావు, మన్నే శ్రీనివాస్, పుప్పాల సూర్యప్రకాశరావు, శాసనసభ్యులు కామినేని క్యాంపు కార్యాలయం పి.ఏ ధనుంజయ,గ్రామ పంచాయతీ కార్యనిర్వ హణాధికారి ఆనంద్ భూషణ్,పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పనులు (1వ పేజీ తరువాయి)

మంత్రి రామానాయుడు శ్రీకారం చుట్టారు. మంత్రి స్వయంగా మోటరు సైకిల్ నడుపుతూ భూమి పూజ శిలాఫలకాల ఆవిష్కరణ చేశారు. మంత్రి మాట్లాడుతూ ఏటిగట్టు పటిష్టతకు శాశ్వత చర్యలు యుద్ధ ప్రాతిపదికన తీసుకుంటామని చెప్పారు. ఈ ప్రాంత ప్రజలను ముంపు నుండి కాపాడతామని హామీ ఇచ్చారు. గత పాలనలో నివాసయోగ్యం కాని స్మశానాలు, చెరువులు, ముంపు ప్రాంతాలు, పల్లపు భూములు వంటివి పేదలకు ఇళ్ళ స్థలాలుగా ఇచ్చి కమీషన్లు దండుకుని నిరుపేదలను నిలువునా మోసం చేశారని అన్నారు. తమ హయాంలో ఒక హెక్టారుకు ఇన్పుట్ సబ్సిడీ రూ.20 వేల రూపాయలు ఉంటే, గత ప్రభుత్వం రూ.16 వేలకు తగ్గించిందన్నారు. నిరుపేద కుటుంబానికి సంవత్సరానికి మూడు ఉచిత గ్యాసు సిలిండర్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు గ్రంధి నాగవెంకట పవన్ కుమార్, డిఇలు కలవకొలను దుర్గారామ స్వామి, పి.శ్రీనివాస రావు, రామాయణం త్రిమూర్తులు, యంపిడివో కార్యాలయ ఏవో జి. శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ సహాయక ఇంజనీర్ వై.వి.ఆర్ నాగేశ్వర రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరుస చోరీలు (1వ పేజీ తరువాయి)

పి.విశ్వం ఘటన స్థలానికి చేరుకొని నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దొంగతనం జరిగిన ప్రాంతాలలో సీసీ కెమెరాలను గుర్తించి సిసి ఫుటేజీల ద్వారా నిందితుల గుర్తించేందుకు చర్యలు చేపట్టారు.

గొలుసు దొంగల కోసం జల్లెడ

కొవ్వూరు, రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో వరుసగా గొలుసు చోరీలకు పాల్పడ్డ బైక్ దొంగలను పట్టుకునేందుకు జాతీయ రహదారిపై పోలీసులు జల్లెడ పట్టారు. బుధవారం ఇద్దరు యువకులు బైక్ పై వచ్చి వరుసగా మహిళల మెడలో చైన్లను దొంగలించుకు పోవడంతో జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అందులో భాగంగా కడియం మండలం వేమగిరి జంక్షన్లో ఇన్స్పెక్టర్ ఎ. వెంకటేశ్వరరావు, ఎస్సై దుర్గాప్రసాద్, ఇతర పోలీసు సిబ్బంది ప్రతి బైకును ఆపి తనిఖీలు చేపట్టారు. నెంబర్ ప్లేట్లు, రికార్డులు లేని బైకులకు అపరాధ రుసుం విధించారు.

నేడు గో- కార్ట్ చాంపియన్‌షిప్ పోటీలు

విశాలాంధ్ర -భీమవరం: ఈ నెల 23 నుండి 26వ తేదీ వరకు ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి 'ఎస్ ఆర్‌కెఆర్ గో- కార్ట్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తు న్నట్లు

కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజు చెప్పారు. ఇందుకు సంబంధించిన పోస్టర్ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు బుధవారం కళాశాలలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ కె.సురేష్ బాబు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగే ఈ పోటీలను గురువారం ఉదయం కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ ప్రారంభిస్తారని చెప్పారు. ఇప్పటికే పోటీల్లో పాల్గొనేందుకు పలు ఇంజనీరింగ్ కళాశాలల నుండి బృందాలు రిజిస్ట్రేషన్ చేయించు కున్నాయని పేర్కొన్నారు. పోటీల్లో విజేతలకు 3 లక్షల రూపాయల వరకు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లుగా వ్యవహరిస్తున్న అధ్యాపకులు వి.వి.మురళీకృష్ణమ రాజు, ఎన్.ఎస్.కె.వర్మ, డాక్టర్ ఐ.ఆర్.పి.వర్మ, యు.రాజేంద్ర ప్రసాద్, విద్యార్థి బృందం పాల్గొన్నారు.

ఆవులకు గర్భకోశ వ్యాధికి చికిత్స చేయవచ్చు

విశాలాంధ్ర - గణపవరం: గేదెలలో, ఆవులలో గర్భ కోస వ్యాధికి చికిత్స చేసి వాటిని చూడు కట్టించడం చేయవచ్చునని, దీనివలన రైతులకు పాల దిగుబడి పెంచడమే ఈ శిబిరం ఉద్దేశం అని

గణపవరం పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ డిఎం నాయక్ అన్నారు. బుధవారం గణపవరం మండలం చిలకంపాడు గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు.పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ చుక్క అప్పారావు ప్రారంభించారు. పశువులకు వివిధ పరీక్షలు చేసి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ శిబిరంలో 30 పశువులకు మందులు పంపిణీ చేశారు. 25 గర్భ కోస వ్యాధులు, 28 పెద్ద పశువులకు, 15 లేగ దూడలకు నట్టల నివారణ మందు తాగించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి. నాగ జ్యోతి యానిమల్ హస్బెండ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఈనెల 30 వరకు ఈ శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు. సరిపల్లి గ్రామంలో 23 తేదీన, ఎస్ కొండేపాడు 24 తేదీన, కొత్తపల్లి 25 తేదీన, జల్లికొమర 27 తేదీన, వాకపల్లి 28 తేదీన, ముగ్గళ్ళ 29 తేదీన, కొమర్రు 30 తేదీన జరుగుతాయని ఆయన తెలిపారు.

నేటి నుంచి హేలాపూరి బాలోత్సవం

విశాలాంధ్ర -ఏలూరు : హేలాపురి బాలోత్సవం 5వ పిల్లల సంబరాలు ఈనెల 23 నుండి 26 వరకు జరుగుతున్నాయని హేలాపురి బాలోత్సవం ఆహ్వాన సంఘం చైర్మన్ ఆదుసుమిల్లి నిర్మల, అధ్యక్షులు ఆలపాటి

నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దేవరకొండ వెంకటేశ్వర్లు, నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు చెప్పారు. అన్నే భవనంలోని బాలోత్సవం కార్యాలయం వద్ద బుధవారం జరిగిన బాలోత్సవం సన్నాహక కార్యక్రమంలో వారు మాట్లాడారు. 2019 నుండి హేలాపురి బాలోత్సవం నిర్వహిస్తున్నా మని చెప్పారు. హేలాపురి బాలోత్సవానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్దల నుండి అపూర్వమైన స్పందన వస్తోందన్నారు. వట్లూరులో ఉన్న సిద్ధార్థ క్వెస్ట్ స్కూల్‌లో బాలోత్సవం జరుగు తున్నదన్నారు. 69 అంశాల్లో నర్సరీ నుండి పదవ తరగతి విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించే వేదికగా బాలోత్సవం కొనసాగుతోందని వివరించారు. 23న ఉదయం 10 గంటలకు కరెన్సీ నోట్లు, ఫ్యాన్సీ కాయిన్స్, మోటివేషన్ ఎగ్జిబిషన్‌తో బాలోత్సవ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. బాలోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చింతలపూడి నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు ఎమ్మెల్యే కృషి

విశాలాంధ్ర-లింగపాలెం: చింతలపూడి నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు ఎమ్మెల్యే రోషన్ కుమార్ చేస్తున్న కృషిపై అందరిలో ఆసక్తి నెలకొంది. సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా యు.ఎస్.ఏలో ఉద్యోగిగా పనిచేస్తూ రాజకీయ ఆరంగేటం చేసి ఎమ్మెల్యేగా గెలుపొందిన రోషన్ కుమార్‌కు విదేశాలలోని పారిశ్రామిక వేత్తలతో మంచి సంబంధాలు ఉన్నాయి.

రాజకీయాల్లోకి వచ్చిన ఈయన చింతలు లేని నియోజకవర్గంగా చింతలపూడిని తీర్చిదిద్దు తాను అనే నినాదంతో అడుగులు వేశారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన ఈయన ఆ దిశగా ముందుకు వెళుతున్నారు. దీనిలో భాగంగా విదేశీ పారిశ్రామిక వేత్తలతో నియోజకవర్గ స్థాయిలో పరిశ్రమల స్థాప నకు చర్చలు నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మానవ వనరుల శాఖమంత్రి లోకేష్ సహకారం తీసుకొని నియోజక వర్గంలో పరిశ్రమలు నెలకొల్పాలనే ధ్యేయంతో ముందుకు వెళుతున్నారు. ఇటీవల అమెరికా పర్యటనకు వెళ్లిన ఈయన విదేశీ పారిశ్రామిక వేత్తలతో సంప్ర దింపులు జరిపారు.దీనిలో భాగంగా రెండు రోజుల క్రితం విజయవాడకు వచ్చిన వీరితో ఎమ్మెల్యే చర్చలు జరిపారు. చింతలపూడి నియోజకవర్గంలో పరిశ్ర మలు నెలకొల్పితే ప్రభుత్వం నుంచి సహ కారం అందుతుందని ముఖ్యమంత్రి తెలపడంతో పారిశ్రామికవేత్తలు పరిశ్ర మలు నెలకొల్పేందుకు ఆసక్తి చూపు తున్నారు. ప్రధానంగా మెట్ట ప్రాంతమైన చింతల పూడి నియోజకవర్గంలో ఇంతకు ముందు ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారంతా వ్యవసాయం, వ్యవసాయ అను బంధ పనులకే ప్రోత్సాహం అందించారు. ప్రస్తుత ఎమ్మెల్యే రోషన్ కుమార్ వ్యవసాయంతో పాటు ఈప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పాలనే దృఢ నిశ్చ యంతో ముందుకు వెళుతుండటాన్ని పార్టీల రహితంగా ప్రతి ఒక్కరూ స్వాగతిస్తు న్నారు. మేధావులు సైతం పరిశ్రమలు నెలకొల్పే ప్రయత్నాలను అభినందిస్తు న్నారు. ఈ ప్రాంతంలో ఏ పరిశ్రమ నెల కొల్పితే విజయవంతం అవుతుందో గుర్తించే పనులు పారిశ్రామికవేత్తలు పరిశీలించ డంలో నిమగ్నం అయ్యారు. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే పోలవరం, దెందులూరు, నూజివీడు నియోజకవర్గాలలోని అనేకమందికి ఉపాధి అవకాశాలు ఉంటాయని మేధావులు అంటున్నారు.

పింగళి వెంకయ్యకు భారతరత్న అవార్డు ఇవ్వాలి

కలెక్టర్‌కు జాతీయ జెండా బహుకరించిన సంఘ సేవకుడు సుభాని

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్యకు భారతరత్న అవార్డును ప్రకటించాలని రాష్ట్రపతి, ప్రధాన మంత్రిని కోరనున్నట్లు ప్రముఖ సంఘ సేవకులు, గాయకులు ఎస్.ఎం.సుభాని చెప్పారు. గణతంత్ర వేడుకలకు సుభాని ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకాలను వివిధ కార్యాలయాలకు, విభిన్న స్వచ్ఛంద సంస్థలకు ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమం ప్రారంభిం చారు. ఇందులో భాగంగా బుధవారం ఏలూరులోని కలెక్టరేట్లో తొలుత జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వికి జాతీయ జెండాను బహుకరించారు. జాతీయ జెండా అమ్మకాలను, కొనుగోలును నిరోధించి ప్రభుత్వమే ఉచితంగా బహుకరించాలని, తద్వారా ప్రతి వ్యక్తికి దేశం పట్ల భక్తి, బాధ్యత పెరుగుతుందని ఈ సందర్భంగా సుభాని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గత 30 సంవత్సరాలుగా సుభాని జాతీయ జెండాలను ఉచితంగా పంచే కార్యక్రమం గురించి, ఆట పాట పేరు మీద మహిళలకు ఉచితంగా కుట్టు పని నేర్పించడం గురించి బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు దేవరకొండ వెంకటేశ్వర్లు వివరించారు. ఇటువంటి మంచి కార్యక్రమం చేపట్టినందుకు కలెక్టర్, డిఆర్ఓ, విద్యుత్ శాఖ ఎస్ఈ సాల్మన్ రాజు, ఇతర ఉన్నతాధికారులు సుభానిని అభినందించారు.

గాదిరాజు బాబుకు పలువురి పరామర్శ

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : భీమవరం డిఎన్నార్ కళాశాల అసోసి యేషన్ సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణ రాజు (బాబు)ను, వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరామర్శించారు. ఈనెల 19న బాబు తండ్రి సోమరాజు (94) మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను భీమవరం మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ గాదిరాజు సోమరాజు సూపరిండెంటెంట్ ఇంజినీర్‌గా ఎనలేని సేవలు చేశారని ఆనాటి ఉన్నత అధికారులు సోమరాజు సేవలను వినియోగించుకున్నారని అన్నారు. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, మాజీ ఎఎంసి చైర్మన్ తిరుమాని ఏడుకొండలు,హరిబాబు రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ ఇరిగేషన్ డిపార్ట్మెంట్ డాక్టర్ గోపాలకృష్ణరాజు, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ రాజన్ రాజు ఈఎన్‌టి స్పెషలిస్ట్ డాక్టర్ బాలకృష్ణ తదితరులు సోమరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి సంతాపం తెలిపారు.

పోలీసు చట్టాలపై అవగాహన కల్పించే డైరీ ప్రచురణ అభినందనీయం : ఎస్పీ కిషోర్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : పోలీసు చట్టాలపై అవగాహన కల్పించేలా పొందుపరిచిన పోలీస్ డైరీ రూపొందించడం అభినంద నీయమని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ చెప్పారు. బుధవారం ఏలూరులోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గల

సమావేశ మందిరంలో పోలీస్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో రూపొందించిన పోలీస్ డైరీని ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ కిషోర్ మాట్లాడుతూ ఎంతో కష్టపడి సిబ్బందికి ఉపయోగపడే విధంగా అన్ని అంశాలను క్రోడీకరించి డైరీని రూపొందించారని ఏలూరు జిల్లా పోలీస్ అధికారుల సంఘం, ఆర్ఐ పవన్ కుమార్‌ను అభినందించారు. ఈ డైరీ సిబ్బందికి కావాల్సిన అన్ని అంశాలలో సహాయపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్.సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్.శేఖర్, ఏలూరు డిఎస్పీ శ్రావణ్ కుమార్, డిటిసి బిఎస్పి ప్రసాద్ రావు, ఏఆర్ డిఎస్పి చంద్రశేఖర్, పోలీస్ ప్రధాన కార్యాలయం ఏఓ బివిఎస్ఆర్కెనాయక్, పోలీస్ కార్యాలయం సువర్చల, ఆర్ఐ పవన్ కుమార్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ శానం రమేష్ బాబు, పోలీస్ సిబ్బంది, ప్రధాన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలి

విశాలాంధ్ర -నిడమర్రు: నిడమర్రు మండలంలో నిరక్షరాస్యులను ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అందరిని అక్షరాస్యులుగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పంతో ఉందని ఏలూరు జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి కెవివి సత్యనారాయణ అన్నారు. నిడమర్రు

మండల మహిళ సమాఖ్య భవనంలో ఏపిఎం ఎం రత్నకుమార్ బాబు అధ్యక్షతన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిడమర్రు మండలంలోని నిరక్ష్యరాసులకు ఉల్లాస్ సెక్షన్ అక్షరాస్యత ట్రైనింగ్ కార్యక్రమంపై కలెక్టర్ ఆదేశాల మేరకు శిక్షణ వివో ఏ లకు కార్యక్రమం నిర్వహించారు.నిడమర్రు ఎంపీడీవో విజయ కుమారి మాట్లాడుతూ నిరక్షరాస్యులైన వయోజనులకు సాంకేతిక విద్య, క్రియాత్మకవిద్య, ఆర్థిక విద్య, అభ్యాసకులకు నేర్పించుటకు వివోఏలుగా పనిచేస్తున్న వారిని వలంటీర్లుగా పనిచేసేం దుకు ఎంపిక చేయడం జరిగిందని వారిచే అభ్యాసకులకు సంక్షిప్తవాచకాలు అక్షర వెలుగు బుక్స్ పంపిణీ చేసినట్టు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్స్ సీసీలు, వి ఓఏ, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపంతో అనారోగ్యం

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి డాక్టర్ పి. కిరణ్మయి ఆధ్వర్యంలో బుధవారం ఆరోగ్య కార్యకర్తలకు మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, ఆశా కార్యకర్తలకు రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ప్రభుత్వ

పాఠశాలలో, అంగన్వాడి కేంద్రం పిల్లలకు హెల్త్ చెకప్ చేసే పద్ధతిపై అందరికీ అవగాహన కల్పించారు. పుట్టుకతో లోపాలు, చిన్నతనంలో వచ్చు పౌష్టిక లోపాలు, చిన్నతనం లో వచ్చు వ్యాధులు, వయసుకు తగ్గ శారీరక, మానసిక పెరుగుదల లేకపోవడంపై మరియు, అంగవైకల్యాల లక్షణముల గురించి సిబ్బంది తెలిపారు. స్కూల్స్, అంగన్వాడి కేంద్రంలో పరీక్షలు చేసేటప్పుడు పూర్తిగా గమనించి చెక్ అప్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జె. విల్సన్ బాబు, హెచ్ వి సి హెచ్ పద్మజ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం: రోగులకు ఏ సమయంలో అయినా ఆపద వస్తే స్వయంగా తనకు ఫోన్ చేయవచ్చని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మొత్తం కలియ తిరిగి రోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా మెడికల్ రూమ్ పరిశీలించి అక్కడ గడువు దాటిన మందులు ఉన్నాయా లేదో తనిఖీ చేశారు. టెస్టింగ్ ల్యాబ్‌లో అన్ని మిషన్లు సరిగా పని చేస్తున్నాయా లేదా చూశారు. వార్డుల్లో స్వయంగా వెళ్లి రోగుల సమస్యలు, ఆసుపత్రిలో సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేషెంట్లు తమ సమస్యలు చెప్పుకునేందుకు స్వయంగా తన ఫోన్ నెంబర్ ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేస్తానన్నారు. ఆసుపత్రిలో డయాలసిస్ పేషెంట్ల తాకిడి ఎక్కువగా ఉన్నందున రూ.రెండు కోట్లతో ప్రత్యేక వసతి ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యుల పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ తాతారావు, జనసేన నాయకులు వర్తనపల్లి కాశి, అడపా ప్రసాద్, పైబోయిన వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలి

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఏ ఉద్యోగి అయినా విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలను పొందాలని ఉంగుటూరు ఎంపీడీవో జి ఆర్ మనోజ్ అన్నారు. ఉంగుటూరు ఏపీవోగా పనిచేసి బదిలీపై కామవరపుకోట వెళ్తున్న మల్లేశ్వరరావును బుధవారం ఉపాధి హామీ కార్యాలయం వద్ద సన్మానం చేశారు. ఎంపీడీవో మనోజ్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు మెమొంటో అందజేసి శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మల్లేశ్వరరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడకు ఏపీఓగా కామవరపుకోట ఏపీవో బదిలీపై రానున్నారు.

నట్టల నివారణ మందును తాగించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పశువులలో వచ్చే నట్టల నివారణకు పశుసంవర్ధక శాఖ అధికారుల ద్వారా ఇచ్చే మందులను తప్పనిసరిగా పశువులకు త్రాగించాలని మంగపతి దేవి పేట గ్రామపంచాయతీ సర్పంచ్ అబ్బు సుబ్రహ్మణ్యం తెలిపారు. పశు వైద్య శిబిరాలు కార్యక్రమం మూడో రోజు కావడంతో మండలంలో మంగపతి దేవి పేట, సీతంపేట, గ్రామాలలో పశువులకు, మేకలకు, కోళ్లకు, వైద్య సేవలు నిర్వహించారు. నట్టల మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో సహాయ సంచాలకులు పి ఎన్ వి. శేఖర్ దొర, పశు వైద్య అధికారులు బిఆర్ శ్రీనివాసన్, దివ్యశ్రీ, పశు వైద్య శాఖ సిబ్బంది, రైతులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పవన్ రాకతో రోడ్డుకు మహర్దశ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పవన్ కళ్యాణ్ రాకతో ఎర్రంపేట, రాజవరం, ఆర్అండ్ బి రోడ్డుకు మహర్దశ కలిగింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల కొయ్యలగూడెం మండలం మీదుగా ద్వారకా తిరుమండలం శివారులో ఉన్న ఐఎస్ జగన్నాథపురం లో లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చారు. ఆ సందర్భంలో మండలంలో ఎర్రంపేట గ్రామం నుండి ఆరు కిలోమీటర్ల మేర రాజ వరం గ్రామ శివారు మూడు పుంతలు వరకు ఆర్ అండ్ బి రహదారి పూర్తిగా అధ్వానంగా తయారవడంతో సంబంధిత అధికారులకు నూతన రహదారిని నిర్మించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో కోటి 40 లక్షల రూపాయల వ్యయంతో రహదారి పనులు ప్రారంభించారు. నూతనంగా నిర్మిస్తున్న రహదారి పనులు చురుకుగా కొనసాగుతున్నాయి.

వ్యవసాయ కార్పొరేటీకరణకై రైతు మెడకు ఉరితాడు

- 26న నిరసన ర్యాలీలను జయప్రదం చేయండి
- కిసాన్ మోర్చా పిలుపు

విశాలాంధ్ర -ఏలూరు : వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతుల మెడకు ఉరితాడులా వ్యవసాయ సాంకేతిక చట్టం, సహకార చట్టం వంటి నూతన చట్టాలు తీసుకువస్తోం దని రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఏలూరు పవరుపేటలోని అన్నే భవనంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ నెల 26న కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై జరుగుతున్న నిరసనలు, ర్యాలీలను విజయవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) జిల్లా కార్యదర్శి షేక్ బాషా, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాస డాంగే, జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.సుందర్రావు, టి.సత్యనారాయణ, ఐఎఫ్‌టియు ఏలూరు నగర ఉపాధ్యక్షులు ఎస్.అప్పారావు, నాయకులు బి.సత్యనారాయణ మాట్లాడారు. ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా రాత పూర్వకంగా ఇచ్చిన వాగ్దానాలను కేంద్ర ప్రభుత్వం గాలికి వదిలి వేసిందని విమర్శించారు. రైతు ఉద్యమానికి తలవంచి రద్దు చేసిన చట్టాలలోని విధానాలతోనే తిరిగి కొత్త చట్టాలను తీసుకు వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన సహకార చట్టం, వ్యవసాయ సాంకేతిక చట్టం మొత్తం రైతాంగాన్ని కార్పొరేట్ కంపెనీల పెత్తనం క్రిందకు తెచ్చేందుకేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా జారీచేసిన వ్యవసాయ మార్కెట్ల జాతీయ విధాన చట్టం ప్రకారం మొత్తం విధానాలను వ్యవసాయాధారిత పరిశ్రమ అధిపతులు, ఎగుమతి దిగుమతి దారులు, విదేశీ వ్యాపారులు రైతులు పంటలను స్వేచ్ఛగా కొనుగోలు చేయడం, నిల్వ చేసుకోవడం, ఎగుమతి చేసుకోవడానికి అనుకూలంగా మార్పులు చేసింద న్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల విధానమే ఇక ఉండదని పేర్కొన్నారు. ప్రభుత్వాల కొనుగోళ్లు ఉండవని, ఆహార భద్రత చట్టానికి తావు లేదన్నారు. ఆహార భద్రత చట్టం కొనసాగింపు, ఉపాధి హామీ పథకం విస్తరణ, కౌలు రైతులకు రక్షణ సాధించడంతో పాటు కార్మికులకు నష్టకరమైన నాలుగు కార్మిక కోడ్లను రద్దు చేయించడం వంటి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కుష్టువ్యాధి గ్రస్తులకు సకాలంలో వైద్యం

నిర్మూలన పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర - ఏలూరు : ఇంటింటి సర్వేలో భాగంగా కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించి సకాలంలో చికిత్స అందించాలని, వ్యాధిని సమూలంగా నిర్మూలించాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 2వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించే కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ, జాతీయ ఆరోగ్య మిషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సంయుక్తంగా కుష్టు వ్యాధిపై ప్రచురించిన అవగాహన పోస్టర్లు, కరపత్రాలను బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా ఫిబ్రవరి 2వ తేదీ వరకు జిల్లాలో కుష్టు వ్యాధి పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసు కుని "కుష్టు" వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో భాగస్వామ్యం కావాల న్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఫిబ్రవరి 2వ తేదీ వరకు మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చర్మంపై స్పర్శ, నొప్పి, దురదలేని మచ్చలు, చెవులపై, వీపుపై, ఎదపై నొప్పిలేని బుడుపులకు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స అందించ బడు తుందన్నారు. కార్యక్రమంలో డిఎం హెచ్ఓ డాక్టర్ మాలిని, జిల్లా కుష్టువ్యాధి నివారణ అధికారి డాక్టర్ ఎం.నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

మంచితనానికి మరో పేరు వెంకయ్య

విశాలాంధ్ర- చాట్రాయి : మంచితనానికి, ఆత్మీయ అభిమానానికి మరో పేరు వెంకయ్య అని సామాజిక చైతన్య వేదిక ఆర్గనైజర్ ఈవీ శ్రీనివాసరావు కొనియాడారు. చాట్రాయి మండలం

చనుబండ గ్రామానికి చెందిన 94 ఏళ్ల వయోవృద్ధుడు తేనేటి వెంకయ్య గత రెండు రోజుల క్రితం గుండెపోటుతో మరణించడంతో బుధవారం సామాజిక చైతన్య వేదిక ఆర్గనైజర్ ఈవీ శ్రీనివాస రావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చనుబండ సెంటర్లో నవ్వుతూ పలకరిస్తూ ఆత్మీయ అభిమానానికి మరో పేరుగా ఉన్నారని కొనియాడారు. టిడిపి ఎస్సీ సెల్ నాయకులు తేనేటి వేణు తండ్రి వెంకయ్య మరణం తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో హెబ్రోను ఫెలోషిప్ పాస్టర్ ఎస్. పీటర్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి గురజాల వారి కోర్టులో

H.M.O.P.NO: 254/2023

బిట్వీన్,
కొండపర్తి @ మారోతు శ్రావణి - వాది
మరియు
మారోతు రాజేష్ - ప్రతివాది

టు,
ది రెస్పాండెంట్
మారోతు రాజేష్, తండ్రి శ్రీహరిబాబు, హిందూ, వయస్సు 29 సంవత్సరాలు, R/o. డోర్ నెం : 8-147, పోతునూరు గ్రామం, దెందులూరు మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

పై దావానందు క్లయింటు పరిహారము నిమిత్తం పై దావానందు ప్రతివాది అయిన మీరు **ది.04-02-2025న ఉదయం 10:30 గంటలకు** స్వయంగా గాని లేదా అడ్వకేట్ ద్వారా హాజరై పై దావా నందు మీకు అభ్యంతరములు తెలియపరచ గలరు. అట్లు మీరు రాని యెడల మీ పరోక్షంపై దావా తీర్మానించబడును.

వాయిదా ది.04-02-2025.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

బి.వి. నరసింహారెడ్డి,
సి. హెచ్ వెంకటేశ్వరరావు,
వాది తరపు న్యాయవాదులు,
మాచర్ల, పల్నాడు జిల్లా.

సుబ్బలక్ష్మి మృతికి సీపీఐ, ఏఐటీయూసీ సంతాపం

విశాలాంధ్ర -ఏలూరు : ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు పల్లి వెంకట నారాయణ తల్లి పల్లి సుబ్బలక్ష్మి (69) మృతికి సిపిఐ, ఏఐటియుసి, ఏపీ ప్రజానాట్య మండలి నాయకులు సంతాపం తెలిపారు. అనారోగ్య కారణాలతో గత కొంతకాలంగా ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బలక్ష్మి బుధవారం ఆసుపత్రిలో తది శ్వాస విడిచారు. సుబ్బలక్ష్మి భర్త పల్లి గంగరాజు గతంలో సిపిఐ గ్రామ కార్యదర్శిగా పని చేశారు. సుబ్బలక్ష్మికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సుబ్బలక్ష్మి మృతికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా సహాయ కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, ఏపీ ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్ బల్ల కనక దుర్గారావు తదితరులు తీవ్ర సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

విశాలాంధ్ర విలేఖరిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర- కైకలూరు: ఇటీవల అనారోగ్యానికి గురైన విశాలాంధ్ర కైకలూరు విలేకరి గొర్తి రాధా కృష్ణను మాజీ శాసనసభ్యులు, వైసీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు, దూలం నాగేశ్వరరావు(డి.ఎన్.ఆర్) బుధవారం కైకలూరు జర్నలిస్ట్ కాలనీలో వారి స్వగృహమునకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణకు ధైర్యం చెప్పారు. పూర్తి ఆరోగ్యంతో త్వరలో విధి నిర్వహణలో పాల్గొనాలని ఆకాంక్షించారు.వీరితోపాటు కురెళ్ళ కిషోర్, గొర్తి రవికాంత్, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు రైతులు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను రైతులు వినియోగించుకోవాలని చింతలపూడి ఎడిఏ బి. నాగకుమార్ తెలిపారు. మండలంలోని బంధంచర్ల, కేతవరం గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారిణి బి. సుమలత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించి రైతులతో కలిసి మొక్కజొన్న తదితర పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఆయిల్ ఫామ్ నవభారత్ కంపెనీ 15రోజులకు నగదు అందిస్తుందని రైతులకు వెంటనే నగదు చెల్లింపులు జరిగేలా చూడాలని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను ఈ పంటలో నమోదు చేయించుకోవాలని తెలిపారు. కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు కార్డులు పొందాలన్నారు. పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయించాలన్నారు. మండల వ్యవసాయాధికారిణి బి. సుమలత ఎన్ పి ఎస్ ఎస్ యాప్ పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బొందలపాటి సత్యనారాయణ, భీమవరపు దామోదర రావు,అగ్నిపర్తి ప్రసాద్, గుడిదల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే కంప్యూటర్ పరిజ్ఞానం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర – ఆలమూరు : విద్యార్థి దశలోనే కంప్యూటర్ పరిజ్ఞానంపై పట్టు సాధించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని కొత్తూరు సెంటర్ ప్రభుత్వ హైస్కూల్‌లో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ అధినేత కృష్ణ పాడిశెట్టి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావు, నియోజకవర్గ టిడిపి యువ నేత బండారు సంజీవ్‌లతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ యాజమాన్యాన్ని అభినందిస్తూ రాష్ట్రం మొత్తం జరగనున్న ఈ కార్యక్రమం మొదటగా ఆలమూరు నుండి ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు. అభివృద్ధి అంతా టెక్నాలజీ విధానాల పైనే ఆధారపడి ఉందన్నారు. కనుక ప్రతి విద్యార్థి కంప్యూటర్ విద్య ద్వారా పూర్తి శిక్షణ తీసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. 2014 – 19 మధ్య కాలంలో విశాఖను సాఫ్ట్‌వేర్ రంగంలో అభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి చేసారని గుర్తు చేశారు. నేడు అధికారంలోకి రాగానే విశాఖను ఐటీ రంగంలో అభివృద్ధిపై దృష్టి పెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ రాజు, ఎంఈఓ బి అప్పాజీ మండల డిసి అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, సర్పంచులు సంగీత సుభాష్, తోట భవాని వెంకటేశ్వర్లు, నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీను, కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలు అమలు చేయాలి

విశాలాంధ్ర – సీతానగరం: ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాలు కచ్చితంగా చేరుకునేలా అధికారులు పని చేయాలని డి ఎల్ డి ఓ వీణా దేవి అన్నారు. మండలంలో గల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఓ ఎమ్ భారతి ఆధ్వర్యంలో డి ఎల్ డి ఓ ముఖ్య అతిథిగా మండల, గ్రామ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాలు చేరుకునే విధంగా అధికారులు అప్రమత్తంగా పని చేయాలని సూచించారు. దీనిలో భాగంగా హౌసింగ్, ఎన్ ఆర్ జి ఎస్, సర్వే మొదలగు వాటిపై సచివాలయం ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీణా దేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదలకు ఇళ్ళ నిర్మాణం చేయాలని దృఢ సంకల్పంతో పని చేస్తుంది అని అన్నారు. సచివాలయంలో ఉన్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తమకు నిర్దేశించిన లక్ష్యాల ఆధారంగా ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్ ఆర్ ఈ జి ఎస్ పరిధిలో జరుగుతున్న గోకులాల నిర్మాణాలు మొదలగు పనులు పై అధికారులు అడిగి తెలుసుకొని తగు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఈ ఓ పి ఆర్ డి కె వి ఎస్ ఎస్ ఎస్ మూర్తి, హౌసింగ్ ఏ ఈ రామ చక్రం, ఏ పి ఎమ్ జిలాని, ఏ పి ఓ నాగ శేష వేణి, అదనపు పంచాయితీ రాజ్ ఏ ఈ జోయెల్, అన్ని గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పెద్ద పీట : కమిషనర్

విశాలాంధ్ర – కాకినాడ : ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తూ కాకినాడ నగరపాలక కమిషనర్ భావన ఐఏఎస్ బుధవారం తెల్లవారుజాము నుంచి అనేక ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వస్తోన్న ఫిర్యాదులపై కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. దీనిలో భాగంగా నగరంలోని మూడో సర్కిల్, ఆరో వార్డులోని ఖాళీస్థలాన్ని పరిశీలించారు. చెత్తతో అధ్వానంగా ఉన్న ఆ ఖాళీస్థలాన్ని శుభ్రం చేసే పనులు పరిశీలించారు. ప్రైవేట్ ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాల్లో చెత్త, మురుగునీరు నిలిచిపోకుండా చూడాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. తొమ్మిదో డివిజన్ కన్నయ్యకాపునగర్‌లో డ్రెయిన్ ధ్వంసమై మురుగునీరు రోడ్డుపైకి వస్తోందంటూ వచ్చిన ఫిర్యాదుపై కమిషనర్ భావన క్షేత్రస్థాయిలో పర్యటించారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని సర్కిల్ స్పెషలాఫీసర్ టీపీఆర్వో శైలజకు సూచించారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట అదనపు కమిషనర్ కెటి సుధాకర్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర – అమలాపురం : కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కమిటీ ముద్రించిన డైరీని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్, ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ మాట్లాడుతూ డైరీని ఆవిష్కరించడం సంతోషదాయకమని, డైరీలో విలువైన సమాచారాన్ని పొందుపరిచిన కులవృక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కమిటీని ఈ సందర్భంగా అభినందించారు. గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేవీపీఎస్ ఆవిర్భావం 1998లో జరిగిందని, ఆ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా బీవీ రాఘవులు నాయకత్వంలో సామాజిక సమస్యలపై సైకిల్ యాత్రను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరిగిందని, అప్పట్లో నేను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యూటీఎఫ్ అధ్యక్షుడిగా ఉండి తెలంగాణ ప్రాంతంలో జరిగినటువంటి సైకిల్ యాత్రలో పాల్గొనన్నారు. డైరీ ఆవిష్కరణలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసిరావు, లీగల్ అడ్వజర్ యాలంగి సత్యనారాయణ, అల్లవరం మండల కన్వీనర్ గెద్దం విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సాంకేతికతను రైతులు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర – నిడదవోలు : అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను వ్యవసాయ రంగంలో వినియోగించడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడితో ఎక్కువ లాభాన్ని పొందవచ్చునని జిల్లా ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ శాఖ రామకృష్ణ అన్నారు. నిడదవోలు మండలం కోరుమామిడిలో ప్రకృతి వ్యవసాయ కషాయాలను, ద్రావణాలను వరి పంటలపై డ్రోన్ సహాయంతో పిచికారి చేయించడం జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ మోడల్ మేకర్ పురుషోత్తం,జిల్లా ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సాక రామకృష్ణ మాట్లాడుతూ ఇవి ప్రధానంగా రబి వరి పంటలపై పురుగులు తెగులు నియంత్రణ కొరకు వేప గింజల ఇంగువ,కుంకుడు చాప బెల్లం కషాయాలను చాప బెల్లం ద్రావణాన్ని డ్రోన్ సహాయంతో 70 ఎకరాల విస్తీర్ణంలో డ్రోన్స్ ద్వారా ఈకార్యక్రమం చేపట్టి నట్లు తెలిపారు. వరి పంటలపై కాండం, తొలిచేపురుగు, రసం పీల్చే పురుగు మాగుడు మొదలగు తెగుళ్లను నియంత్రించడానికి ప్రకృతి వ్యవసాయ కషాయాలు పిచికారి చేయడం ఎంతగానో ఉపయోగపడు తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో సూర్యవతి, సత్య రూప ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు కె శేషుబాబు, రాపాక వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులు

విశాలాంధ్ర – కరప : ప్రభుత్వం సచివాలయాల్లో ఆధార్ నమోదు అవ్వని జీరో నుంచి ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేయటం జరిగిందని ఎంపీడీవో ఎం అనుపమ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అనుపమ కోరారు. ఈ కార్యక్రమం ఈనెల 23 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నారని తెలిపారు.

ఉచిత పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర – కరప : కరప మండలం పెనుగుదురు గ్రామంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించి పశువులకు పరీక్షలు నిర్వహించామని వెటర్నరీ ఏడి సురేష్ బాబు, పశు వైద్యులు డాక్టర్ రవి కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల జనసేన పార్టీ అధ్యక్షులు, బండారు మురళి, నాయకులు గంట నాని బాబు, విచ్చేసి రైతుల పాడిపశువులకు 140 గేదెలకు, 40 ఆవులకు జలగల నివారణ మందు మందులు పంపిణీ చేశారు. గొర్రెలకు నట్టల నివారణ, గొడ్డు పశువులకు గర్భకోశ వ్యాధులు సంబంధించిన మందులు పునరుత్పత్తి జరిగేందుకు మందులు ఇవ్వడం జరిగింది. పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కీర్తి లోకేష్‌కు అంతర్జాతీయ అవార్డు

విశాలాంధ్ర – నిడదవోలు : హైదరాబాద్‌లో ప్రముఖ మల్టీ నేషనల్ మెడికల్ కంపెనీ (ఏఎంఈ ఏ) లో పనిచేస్తున్నా నిడదవోలు పట్టణానికి చెందిన కీర్తి లోకేష్ కు మన దేశంలోనే బెస్ట్ సేల్స్ పెర్ఫార్మర్ గా ఇంటర్నేషనల్ అవార్డు లభించినట్లు తండ్రి కీర్తి ఆంజనేయులు తెలిపారు .ఇటీవలె మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగిన కంపెనీ అంతర్జాతీయ సెమినార్‌లో కీర్తిలోకేష్‌కు ఈ అవార్డు అందజేశారన్నారు. కీర్తి లోకేష్ రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు పాస్ట్ ప్రెసిడెంట్ కీర్తి ఆంజనేయులు పెద్ద కుమారుడు. ఇండియా స్థాయిలో ఉత్తమ సేల్స్ పెర్ఫార్మర్‌గా నిలిచి అంతర్జాతీయ అవార్డు పొందిన లోకేష్‌ను, అతని తల్లితండ్రులను పలువురు అభినందించారు.

రాజా ఆరోపణలపై వెంకటలక్ష్మి ఆగ్రహం

విశాలాంధ్ర – సీతానగరం: మాజీ ఎమ్మెల్యే రాజా ఆరోపణలపై జనసేన పార్టీ నా సేన నా వంతు కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కోరుకొండ మండలం జనసేన పార్టీ కార్యాలయంలో బత్తుల వెంకటలక్ష్మి మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆరోపణలు అన్నీ అవాస్తమని విలేకరు లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బత్తుల వెంకటలక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ మమ్మల్ని విమర్శించడానికి మీకు వేరే విషయాలు దొరక్క ఎప్పుడూ నా ఎంపీటీసీ పదవి గురించి మాట్లాడుతున్నారు. మేము నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను కళ్ళు తెరిచి చూడండి అని అన్నారు. మీరు 5 సంవత్సరాలలో చేయనిది మేము 8 నెలల కాలంలో చేసి చూపించామన్నారు. ఇంకా అభివృద్ధి చేసి చూపిస్తాం అన్నారు. అలాగే ఎటువంటి రాజకీయ చరిత్ర లేని మా మీద నువ్వు దారుణంగా చిత్తుగా ఓడిపోయావ్ అది మర్చిపోకు అని ఎద్దేవా చేశారు. ఎంపీటీసీ భర్త పోటీ చేస్తేనే 35 వేల ఓట్ల తేడాతో ఓడిపోయావంటే నేను పోటీ చేస్తే 50 వేల ఓట్లతో ఓడిపోతావ్ ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన వీర మహిళలు, నాయకులు, జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

యూనిట్ 203 & 204, 2 వ అంతస్తు, "ఎ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సేవ్రి (వెస్ట్), ముంబై 400015. మహారాష్ట్ర.
సిఐఎన్ నం. : యు65922ఎంహెచ్2005పిఎల్‌సి272501

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్టు చట్టం –2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు–2002 నిబంధన 9తో చదివే సెక్షన్ 13(12) కింద అతనికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ అధీకృత అధికారిగా ఈ దిగువ సంతకందారు ఈ కింద పేర్కొన్న రుణగ్రహీతలకు సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా సంబంధిత నోటీసులో పేర్కొన్న బకాయిలను తిరిగి చెల్లించవలసిందిగా ఈ కింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. రుణగ్రహీతలు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పైన పేర్కొన్న చట్ట నిబంధనల్లో నిబంధనల 9తో చదివే సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు ఈ కింద వివరించిన షెడ్యూల్ ఆస్తిని స్వాధీనం చేసుకోవడమైనది.
ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని,ఈ ఆస్తితో ఏ ఒప్పందాలైనా ఈ కింద పేర్కొన్న మొత్తం బకాయి మరియు దానిపై వడ్డీ, వ్యయాలు మొదలైనవాటి కొరకు వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ బ్రాంచ్ చార్జికి లోబడి వుండునని ప్రత్యేకించి రుణగ్రహీత , హామీదారు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

వ. నం.	రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు మరియు లోన్ ఎకౌంట్ నం.	డిమాండ్ నోటీసు తేదీ మొత్తం బకాయి	ఆస్తి యొక్క వివరాలు	స్వాధీనత రకం & తేదీ
1	బాల బాలాజీ పొప్పొప్పుల కరుణ మహాలక్ష్మి పొప్పొప్పుల LP0000000029930 & LP0000000051738	19-జూన్-23 12- జూన్-23 నాటికి రూ. 1411847 & రూ. 279281	ఆర్.ఎస్.నం. 505/4, 505/5, 505/17, మలికి పురం సబ్-రిజిస్ట్రార్, డోర్ నెం.7-61 దగ్గర, శంకరగుప్తం, మలికిపురం మండలం, తూర్పు గోదావరి, ఆంధ్ర ప్రదేశ్, 533250. హద్దులు: ఉత్తరం : పొప్పొప్పుల సూర్య చంద్ర బాల గోపాల నరసింహారావు ఆస్తి, దక్షిణం : పొప్పొప్పుల వీర వెంకట కనక సత్యనారాయణమూర్తి ఆస్తి, తూర్పు: పొప్పొప్పుల సూర్య చంద్ర బాల గోపాల నరసింహారావు ఆస్తి, పడమర: పొప్పొప్పుల విజయ పార్థసారథి శ్రీనివాసరావు ఆస్తి.	భౌతిక స్వాధీనత స్వాధీనత తేదీ: 18-జనవరి-2025

తేదీ: 23.01.2025
ప్రదేశము: తూర్పు గోదావరి

అధీకృత అధికారి
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

ఘనంగా గిడుగు రామ్మూర్తి వర్ధంతి

విశాలాంధ్ర - గోపాలపురం : తెలుగు వ్యవహారిక భాషకు గుర్తింపు తెచ్చిన పితామహుడు 'గిడుగు రామ్మూర్తి' వర్ధంతి వేడుకలను మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల గోపవరంలో ప్రధానో పాధ్యాయులు గొల్లపల్లి విజయ్ కుమార్ అధ్యక్షతన ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు మంచిలి కుమారస్వామి మాట్లాడుతూ వ్యవహారిక భాష ఉద్యమాన్ని నడిపిన వ్యవహారిక భాషా పితామహుడిగా పేరుపొంది, తెలుగు భాషకు ఎనలేని సేవ చేసి, గ్రాంధికమైన భాష తెలుగు భాషా మనుగడకు అవరోధమని, వ్యవహారికమైన భాషగా ఉండాలని పండితులతో పోరాటం చేసి ఆనాడు వ్యవహారిక భాషను ఒక ఉద్యమంగా తీసుకొచ్చిన 'గిడుగు ఒక పిడుగు' అని అన్నారు. వ్యవహారిక భాషకు వేసిన అడుగు మన గిడుగు అని కొనియాడారు. భాషావేత్తల్లో ఎనలేని కీర్తి పొందిన గిడుగు రామ్మూర్తి పంతులు సర్వదా అభినందనీయులు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, కాశీ విశ్వేశ్వర రావు, ఫణి కుమార్ శర్మ, భాస్కర్ రావు, సీఆర్పి కొయ్యా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చండీ హోమం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం ఎర్నగూడెం శివారు సూర్యనారాయణపురంలో సింగమ్మతల్లి 27వ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం శ్రీ చండీ హోమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రముఖ వేద పండితులు ఐ పోలవరం మండలం మురమళ్ళ గ్రామానికి చెందిన ఎనమండ్ర సత్య సీతారామ శర్మ, వెలవలపల్లి వెంకట నరసింహా శర్మ, కాళ్ళకూరి అచ్యుతరామ శర్మ, చంద్రమౌళి శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో చండీ హోమం అమ్మవారి కుంకుమ పూజలు వివిధ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పుట్ట బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - పిఠాపురం : పిఠాపురం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్ఆర్బీ హెచ్ఆర్ హైస్కూల్లో స్టూడెంట్సకు డ్రగ్స్ వద్దు బ్రో అనే మాదకద్రవ్యాలు వాటి అనర్థాలు గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి, బాలికల రక్షణ కొరకు స్కూలులో వారితో ప్రతిజ్ఞ చేయించారు. పిఠాపురం టౌన్ ఎస్సై మాట్లాడుతూ ఆకతాయి కుర్రాల నుంచి ఎటువంటి ఇబ్బందులు ఉన్న తక్షణమే తమ దృష్టికి లేదా తమ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని ఇవి టీజింగ్ పాల్పడినట్లయితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళల రక్షణకు ప్రాధాన్యతనిస్తామన్నారు.

ఆసుపత్రుల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆలమూరు : ప్రజారోగ్య దృష్ట్యా ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని(సిహెచ్సి) నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావుతో కలిసి ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, సిబ్బందితో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ముందుగా ఆసుపత్రిలో ఉన్న రోగుల వార్డులను, ప్రసూతి, మార్చురీ భవనాలను, డ్రైనేజులు తీరు పరిశీలించి, పలు వివరాలను ఆసుపత్రి సిబ్బంది నుండి ఆయన సేకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్గా ప్రతి అంశాన్ని కూలంకషంగా చర్చించడం జరిగిందన్నారు. ఇందులో వైద్యులను ఇబ్బందులకు గురిచేసే అంశాలు ఉన్నాయన్నారు. స్థానికులు కొందరు మద్యం సేవించి ఆసుపత్రి సిబ్బందిపై దౌర్జన్యం చేసిన సంఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఇటువంటివి పునరావృతం కాకూడదని స్థానిక ఎస్సై ఎం అశోక్కు అల్లరిమూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక్కడ ఏడుగురు వైద్యులకు గాను ప్రస్తుతం నలుగురు మాత్రమే ఉండటంతో వైద్య సేవలు రోగులకు తక్కువగా అందుతున్నాయని వైద్యులు తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గైనిక్ డాక్టర్ ఈ ఆస్పత్రికి ఎంతో అవసరమని వెంటనే తీసుకోవడం జరుగుతుందని, అలాగే ఇతర సంబంధిత వైద్యులను భర్తీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ.రాజు, ఎస్సై ఎం అశోక్, ఆసుపత్రి సూపరిండెంటెంట్ గోపిరామ్ పిల్లి, కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలోని జొన్నాడ గ్రామంలో ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం గ్లోబల్ డెవలప్మెంట్ ఢిల్లీ వారిచే అయోడిన్ లోపంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా గ్రామ నాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సమావేశంలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్మెంట్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కో ఆర్డినేటర్ కే శ్రీనివాస్ పాల్గొని ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ఆర్థిక సహకారంతో చేస్తున్న కార్యక్రమాలను వివరించారుఏలూరు ఆశ్రమం హాస్పిటల్ డాక్టర్ శ్రావణ్ మాట్లాడుతూ అయోడిన్ లోపించడం వల్ల ఎటువంటి అనారోగ్యాలు వస్తాయి, అయోడిన్ ఏస్థాయిలో తీసుకోవాలనే దాని గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా సరైన స్థాయిలో అయోడిన్ తీసుకోకపోవడం వల్ల పొడిబారిన చర్మం, ఎదుగుదలలో లోపం, థైరాయిడ్, రక్తహీనత వంటి సమస్యలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్ట శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ తాడి శ్రీనివాస్ రెడ్డి (బట్టి శ్రీను), పేరెంట్స్ కమిటీ చైర్మన్ మెర్ల శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాది చెరుకురి శ్రీహరి, గొడవర్తి దుర్గాప్రసాద్ (బాబి), తాడి మెహర్ ఆదిత్య రెడ్డి, నామాల సూరిబాబు, మల్లిడి సూర్యనారాయణ రెడ్డి, ప్రధానోపాధ్యా యులు అనంత శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు ప్రాంగణ ఎంపిక

విశాలాంధ్ర - కాకినాడ : జెఎన్టియుకె ప్రాంగణంలో బుధవారం ఐఐపి&టి డైరెక్టరేట్, స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ & టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో అలుమ్ని ఆడిటోరియం నందు ఫార్మసీ విద్యార్థులకు విశాఖపట్నంలోని సినర్జీన్ కంపెనీ వారు పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ముందుగా సినర్జీన్ కంపెనీ ప్రతినిధులు ఇన్చార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్జి మురళీకృష్ణని విసి ఛాంబర్ నందు కలువగా ఇంటర్వ్యూలకు హాజరైన విద్యార్థులు తమ డిగ్రీ పట్టాను అందుకున్న వెంటనే తగిన ఉద్యోగం పొందేలా వారికి తగిన తర్ఫీదునిస్తున్నామన్నారు. రెక్టార్ ప్రొ కెవి రమణను కలిసి సినర్జీన్ కంపెనీ ప్రొఫైలును వివరించి తాము చేపట్టే పూల్ క్యాంపస్ డ్రైవ్ వివరాలను తెలియజేశారు. ఈ పూల్ క్యాంపస్ డ్రైవ్లో విశాఖపట్నంలోని సినర్జీన్ కంపెనీ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఐఐపిటి డైరెక్టర్ ప్రొ బిటి కృష్ణ, స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ & టెక్నాలజీస్ డైరెక్టర్ ప్రొ కె పద్మప్రియలు తెలిపారు. జెఎన్టియుకె అనుబంధ కళాశాలల నుండి సుమారుగా 200 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా 60మంది ఎంపికయ్యారన్నారు. పూల్ క్యాంపస్ డ్రైవ్కు హాజరైన విద్యార్థులకు స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ & టెక్నాలజీస్ విభాగాధిపతి డా బి భవానీ ఆధ్వర్యంలో ప్లేస్మెంట్ ఆఫీస్ వద్ద వ్రాత పరీక్ష మరియు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాథ్, సినర్జీన్ కంపెనీ సీనియర్ మేనేజర్ రవిశర్మ, హెచ్ఆర్ మేనేజర్ రవితేజ, ఎగ్జిక్యూటివ్ హెచ్ఆర్ చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్వారీ గోతులు పూడ్చాలి : కొండబాబు

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : రాజమండ్రి క్వారీ ప్రాంతంలోని క్వారీ గోతులను వెంటనే పూడ్చాలని నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు డిమాండ్ చేసారు. బుధవారం క్వారీ గోతుల వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్వారీ ప్రాంతం పేదలు నివసించే ప్రాంతమని, ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలు ఈ ప్రాంతంలో నివసిస్తున్నారన్నారు. రోజువారి కూలి పనులు చేసుకుని జీవించే ప్రజలు ఇక్కడ అధికంగా నివసిస్తున్నారన్నారు. ఈ క్వారీ గోతుల్లో పడి అనేక మంది యువకులు ప్రాణాలు కోల్పోయారని వెంటనే ఈ గోతులను పూడ్చాలని కొండబాబు డిమాండ్ చేసారు. పేద ప్రజల ప్రాణాలను బలిగొంటున్న ప్రమాదకర గోతులను వెంటనే పూడ్చాలని, దీనిపై ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరారు. లేదంటే ఏ సమయంలోనైనా నిరవధిక నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. ఈ ప్రమాదకర గోతులను పూడ్చాలని 2011లో కోర్టుకు వెళ్ళామని, అయితే కోర్టు ఉత్తర్వులను అధికార యంత్రాంగం నేటికి అమలు చేయలేదన్నారు. గతంలో మాజీ కమీషనర్ విజయరామరాజు అయాంలో నలుగురు క్వారీ యజమానులు తమ క్వారీ గోతులను ప్రభుత్వానికి రాసి ఇచ్చారని గుర్తు చేసారు. క్వారీ గోతులను పూడ్చలేని మిగిలిన యజమానులు అదే విధంగా ప్రభుత్వానికి రాసి ఇవ్వాలని బర్రే కొండబాబు డిమాండ్ చేసారు.

రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్లో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - అమలాపురం : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో జరిగిన రెండవ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో జూనియర్ విభాగంలో సర్ సివి రామన్ పాఠశాలకు సంబంధించిన బలసాడి నవ్య, బలసాడి నేహాల్ సత్య నభిత్ వారి యొక్క అత్యుత్తమ స్కేటింగ్ ప్రదర్శనతో బ్రాంజ్ మెడల్, సిల్వర్ మెడల్ సాధించి ప్రథమ శ్రేణిలో నిలిచారు. ఈ సందర్భంగా జరిగిన పాఠశాల అభినందన సభలో పాఠశాల డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు విజేతలను అభినందించి, పాఠశాల దశలో విద్యతో పాటు వివిధ రకాల నైపుణ్యాలను అలవర్చుకుంటే బంగారు భవిష్యత్తు మీ సొంతమవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, ప్రిన్సిపల్ ఎం శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ కె పెద్దిరాజు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

విశాలాంధ్ర - అమలాపురం : అల్లవరం మండలం దేవగుప్తం గ్రామంలో అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన జిల్లా దివ్యాంగ సంఘ గౌరవాధ్యక్షులు అమలాపురం వైఎస్ఆర్సీపీ నాయకులు వంటెద్దు వెంకన్న నాయుడు అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఇద్దరు దివ్యాంగులు ఉండడం చాలా దురదృష్టం వెంటనే వారిని ఆదుకోవాలని స్థానిక అధికారులను కోరి సంఘం తరఫున అగ్ని ప్రమాదం బాధితులకు నగదు అందజేశారు. పోతుల నాగరాజు, సాధనాల వెంకట్రావు, తిక్క బాబి, గుర్రాల శ్రీను, దివ్యంగ సంఘ నాయకులు నాగవరపు పరశు రాముడు, బొంతు శ్రీనివాస్, సాధనాలు విగ్నేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామంలో కేంద్రం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు చట్టాలను రద్దు చేయాలని ఐఎఫ్టియు కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం నిరసన చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు నాయకులు సిహెచ్ రమేష్ పి నాగేశ్వరరావు గంట నూకరాజు గోపి ఆంజనేయులు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి ఆకుకూరలు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం ధుమంతునిగూడెం/కొత్తగూడెం గ్రామాల్లో పోషణ వాటిక భాగంలో అంగన్వాడీ సెంటర్లల్లో ప్రకృతి వ్యవసాయం పద్ధతుల్లోపెంచినా ఆకుకూరలు, కూరగాయలు సంపూర్ణ ఆరోగ్యానికి ఆకుకూరలు తినాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శీరంగం రామలక్ష్మి టిడిపి నాయకులు వుండపల్లి నరేంద్ర, జనసేనానాయకులు గుడిసె పోసి వెంకటరత్నం, అయినాల నరసింహామూర్తి, ఆకుకూరలు కూరగాయలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఇన్ =ఛార్జ్ శ్రీనివాస్, ఏసుకుమారి, అంగన్వాడీ సిబ్బంది. సచివాలయం సిబ్బంది, ఆశావర్కులు, స్కూల్ టీచర్స్, గర్భిణీలు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ హైకోర్టు ఆఫ్ ఆంధ్రప్రదేశ్, అమరావతి వారి కోర్టులో

CMA No. 789/2024

బిట్వీన్:

గడగట్ల శ్రీనివాసు - పిటీసనర్

(గడగట్ల భరత్ చంద్ర మైనర్ వ్యవహారంలో డోర్‌నెం. 15-1-356, అర్.బి.కొత్తూరు, పెద్దాపురం మండలం, కాకినాడ జిల్లా.)

మరియు

నిల్ - రెస్పాండెంట్స్

పై నెంబరులో తెలిపిన పిటీషనర్ కుమారుడైన గడగట్ల భరత్‌చంద్ర మైనర్ అయినందున పిటీషనర్ కుమారుడికి చెందిన దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని సదరు మైనర్ అవసరాల నిమిత్తం అమ్ముటకు అనుమతి ఇప్పించమని పైన తెలిపిన సి.ఎం.ఎ. దాఖలా చేయడమైనది. సదరు విషయంపై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 14 రోజులలో సదరు కోర్టువారిని వ్యక్తిగతంగా గాని, న్యాయవాది చేతగాని తమ అభ్యంతరములు తెలియజేయవలసినదిగా హైకోర్టు వారు ఆదేశముతో ఈ ప్రకటన జారీ చేయడమైనది.

షెడ్యూలు:

East Godavari Dist, Presently Kakinada Dist, Peddapuram (M), Peddapuram Sub Division, Pedda puram Municipality Ward No.12, on the way to Rayabhupalapatnam side Road, S.No. 158/12, Door No. 15-1-35/8, House and Empty site bounded by

East: Road 30'6"

South: Site of Mari Venkata Rao 54'

West: Site of Marni Venkata Rao 30'6"

North: Site of Chinna Marni Venkata Rao 54'

Sd/- **Raja Bhogendranath S**
Advocate, High Court of Andhra Pradesh
Counsel for Petitioner

పశు వైద్య శిబిరాలతో పాడి రైతులకు చేయూత

విశాలాంధ్ర - సీతానగరం: పాడి రైతులకు చేయూత కొరకే ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహణ అని డిప్యూటీ డైరెక్టర్ ఎమ్ వెంకటేశ్వరరావు అన్నారు. బుదవారం పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో సీతానగరం మండలంలో ముల్లకల్లంక రైతు సేవా కేంద్రంలో ఉచిత పశు వైద్య శిబిరం మండల వైద్య అధికారి డాక్టర్ ఫణీంద్ర ఆధ్వర్యంలో పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎమ్ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ పశు ఉచిత వైద్య శిబిరం ద్వారా సుమారు 84 పశువులకు,250 జీవాలకు చికిత్సలు చేయడం జరిగిందన్నారు. శిబిరం ద్వారా 47 మంది రైతులు లబ్ధి చేకూరింది అని అన్నారు. ఈ శిబిరాలు ద్వారా రైతులకు ఉచిత మందులు, పశువులకు నట్టల నివారణ మందులు, పశు వ్యాధి చికిత్సలు, గర్భకోశ వ్యాధుల చికిత్సలు, జీవాలకు టీకాలు మొదలగు సేవలను మా వైద్యులు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోలిన గోవిందరాజులు, వి ఐ ఆదిలక్ష్మి, వి ఎచ్ ఏలు అంగార సాయి, చిలకమ్మా, బుజమ్మ, శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని సర్వర్లు .. స్తంభించిన రిజిస్ట్రేషన్లు

విశాలాంధ్ర -కొవ్వూరు : కొవ్వూరు పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం నందు సర్వర్లు పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ స్తంభించింది. మంగళవారం రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు సర్వర్ పని చేయకపోవడంతో తిరిగి వెళ్లి బుధవారం మరల కార్యాలయానికి చేరుకొగా అదే పరిస్థితి నెలకొనడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద పడికాపులు కాస్తున్నారు. ఏ సమయంలో సర్వర్లు పనిచేస్తాయోనని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయ విస్తరణకు డ్రోన్ దోహదం

విశాలాంధ్ర -పెరవలి : ప్రకృతి వ్యవసాయ విస్తరణకు డ్రోన్ సహాయంతో సాంకేతిక విధానంలో డ్రోన్ పిచికారి చేశారు. బుధవారం పెరవలి మండలంలో ముక్కామల గ్రామలలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూర్యనారాయణ సమక్షంలో సేంద్రియ కషాయాలను ద్రావణాలను వరి మొక్కజొన్న పంటలపై పిచికారి చేశారు. ఇవి ప్రధానంగా రబి వరి, మొక్కజొన్న పంటలపై కత్తెర పురుగు పురుగులు తెగులు నియంత్రణ కొరకు అగ్నిస్త్రం, వేప గింజల ఇంగువ,కుంకుడు చాప బెల్లం కషాయాలను చాప బెల్లం ద్రావణాన్ని డ్రోన్ సహాయంతో 150 ఎకరాల విస్తీర్ణానికి పిచికారీ చేయించినట్లు డివిజన్ మోడల్ మేకర్ ఉమామహేశ్వరరావు తెలిపారు. జిల్లా ప్రాజెక్ట్ ఎగ్జిక్యూట్ సాక రామకృష్ణ మాట్లాడుతూ వరి పంటలపై కాండం, తొలిచేపురుగు, రసం పీల్చే పురుగు మాగుడు మొదలగు తెగుళ్లను నియంత్రించడానికి ప్రకృతి వ్యవసాయ కషాయాలు పిచికారి చేయడం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో వెంకటకృష్ణ సూర్యనారాయణ, జ్యోతి భవాని, జివిఆర్ ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

విశాలాంధ్ర - తాళ్ళరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పి మల్లవరం పంచాయతీకి చెందిన పురోహితులు కీ.శే కృష్ణమూర్తి భార్య సూర్యాకాంతం ఇటీవలే వైకుంఠం చెందారు, మనుమడు సురేష్ సహకారంతో కుమారుడు పట్టాభిరామాచార్యులు, మనుమళ్ళు రాంబాబు, చిన్న, రంగ ఆధ్వర్యంలో పి.మల్లవరం పంచాయతీలోని 50 మంది నిరుపేదలకు భోజనం, దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ (బాబి) మాట్లాడుతూ లండన్ నగరంలో ఉంటున్న సురేష్ వాళ్ల మామ సూర్యాకాంతం జ్ఞాపకార్థం అన్నదానం, వస్త్రదానం మా ద్వారా చేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో ధూళిపూడి సుబ్బారావు, రాయుడు సింహచలం, వెంటపల్లి నాగభూషణం, ఆనాల పాపారావు, ధూళిపూడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడేవారికి పార్టీలో గుర్తింపు : ఉమ్మడి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కష్టపడ్డ వారికే పార్టీ గుర్తించి పదవులు ఇస్తుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఉమ్మిడి వెంకట్రావు అన్నారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా ఎంపికైన మండలంలో పెద శంకర్లపూడి గ్రామానికి చెందిన కర్రీ ధర్మరాజును ఉమ్మిడి వెంకట్రావు, బీజేపీ మండల అధ్యక్షులు వూట వీరబాబు తదితరులు మర్యాదపూర్వకం కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉమ్మిడి వెంకట్రావు మాట్లాడుతూ కర్రి ధర్మరాజు చాలా సంవత్సరాల నుండి బీజేపీ పార్టీకి నిబద్ధత విధేయతతో పార్టీకి అందించిన సేవలకు తగిన గుర్తింపు ఇచ్చి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా నియమించడం పట్ల వెంకట్రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాని పల్లి శ్రీనివాస్, రామకుర్తి సూర్యనారాయణ, గొనగాని గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి, డోర్ నెంబర్ 24-1-37, వీవర్స్ కాలనీ నివాసులైన **వాసంశెట్టి ధనలక్ష్మి భర్త వెంకట నారాయణ రావు** వ్రాయించి ఇచ్చిన ప్రకటన.

నా తండ్రి గారైన **కొప్పిశెట్టి కృష్ణమూర్తి**, తండ్రి అదియ్య డోర్ నెంబర్ 5-93, కొప్పిగుంట, కాట్రేనికోన మండలంలో మా ఇంటి వద్ద **ది.16-11-2005** న మరణించారు. వీరి మరణం ప్రభుత్వ రికార్డులలో నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరములు ఉన్నయెడల **10 రోజులలో** తెలియజేయగలరు.

వాసంశెట్టి ధనలక్ష్మి, భర్త వెంకట నారాయణరావు
డోర్ నెంబర్ 24-1-37, వీవర్స్ కాలనీ,
రాజమండ్రి అర్బన్, తూర్పుగోదావరి జిల్లా.
సెల్:7207270511

Form No. URC-2
Advertisement giving notice about registration under Part I of Chapter XXI

[Pursuant to section 374(b) of the companies Act, 2013 and rule 4(1) of the companies (Authorised to Register) Rules, 2014]

1. Notice is hereby given that in pursuance of sub-section (2) of section 366 of the Companies Act, 2013, an application is proposed to be made after fifteen days hereof but before the expiry of thirty days herein after to the Registrar at Central Registration Centre (CRC), Indian Institute of Corporate Affairs (IICA), Plot No.6,7,8 Sector 5, IMT Manesar, District Gurgaon(Haryana) 122050 that M/S EVB TECHNOLOGIES a Partnership Firm may be registered under Part I of Chapter XXI of the Companies Act 2013, as a company limited by shares under the name and style. M/s EVB BIOCARE PRIVATE LIMITED.
2. The principal objects of the company are to carry on the business of collecting and treating the medical waste collected from various hospitals that are both Government and Private.
3. A copy of the draft memorandum and articles of association of the proposed company may be inspected at the office at D.No. 77-6-22, Rtc Complex, Internal Road, Gandhi Puram, Rajahmundry, East Godavari, - 533103, Andhra Pradesh.
4. Notice is hereby given that any person objecting to this application may communicate their objection in writing to the Registrar at Central Registration Centre (CRC), Indian Institute of Corporate Affairs(IICA), Plot No.6,7,8 Sector 5, IMT Manesar, District Gurgaon(Haryana) - 122050, within twenty-one days from the date of publication of this notice, with a copy to the company at its registered office.

For **M/S EVB TECHNOLOGIES**

Date : 22-01-2025
Place: Rajahmundry

Sd/- M.V. Rajgopal Reddy
(Managing Partner)

కోనసీమ తిరుమల హుండీ ఆదాయం లెక్కింపు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం ఈనెల కోటి రూపాయలు దాటింది. బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హుండీలు తెరిచి లెక్కింపు ప్రారంభిం చారు. 40 రోజులకు ఆలయ ప్రధాన హుండీల నుంచి రూ.1,20,88,369, అన్న ప్రసాదం హుండీల నుంచి రూ.22,38,344, వెరసి రూ.1,08,89,635 ఆదాయం వచ్చిందని కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. అలాగే 19 గ్రాముల బంగారం, 890 గ్రాముల వెండి పలు దేశాల విదేశీ 50కరెన్సీ నోట్లు వచ్చాయని చెప్పారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయ హుండీల నుంచి రూ.4,22,210 ఆదాయం వచ్చిందని తెలిపారు. రాజమహేంద్ర వరం తనిఖీదారు టివిఎస్ఆర్ ప్రసాద్, రాజమండ్రి గ్రూప్ దేవాలయాల కార్యనిర్వహణాధి కారి ఎన్‌విఎన్ఎస్‌వి ప్రసాద్ రాజు, గన్నవరం పర్యవేక్షణలో లెక్కింపు చేపట్టారు. వాడపల్లి ఉపసర్పంచ్ పి బాబూరావు, దేవస్థానం మాజీ ఛైర్మన్ నరసింహారావు, అర్చకస్వాములు, గ్రామస్తులు, రావులపాలెం కెనరా బ్యాంక్, అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుతో ప్రయోజనాలు

విశాలాంధ్ర - రాజానగరం : పంట నమోదుతో ప్రయోజనాలు మెండుగా ఉంటాయని, 2024-25 ఏడాదికి సంబంధించి రైతులు తప్పనిసరిగా దాళ్వా పంట నమోదు, ఈ కెవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి (ఏవో)ఎస్.కె.ఇమామి ఖాసిం అన్నారు. మండలంలోని మల్లంపూడి మరియు ముక్కినాడ గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమాలకి విచ్చేసిన ఏవో ఎస్.కె.ఇమామి ఖాసిం తొలుత ఆయా గ్రామంలో దాళ్వా పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ శాఖాధికారులు డి. జ్యోతి,బి.శేఖర్, కూటమి నాయకులు పి.భీమరాజు, కరటం పోతురాజు పాల్గొన్నారు.

గ్రేడ్ -4 కార్యదర్శులుగా పదోన్నతి

విశాలాంధ్ర - కడియం : కడియం మండలంలో నలుగురు గ్రామ సచివాలయ కార్యదర్శులకు గ్రేడ్- 4 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గ్రేడ-5 కార్యదర్శిలకు పంచాయతీ గ్రేడ్ -4 కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా మండలంలో మొత్తం 11 మంది గ్రామ సచివాలయ గ్రేడ్-5 కార్యదర్శులు ఉండగా వారిలో మండల కేంద్రమైన కడియం నుండి ఎస్.నాగమల్లి, ఎల్.శివబాబు, వేమగిరి నుండి కె.పాపారా యుడు, దామిరెడ్డిపల్లి నుండి బి. ప్రభాకర్ లకు ఈ పదోన్నతి లభించింది. ఈ పదోన్నతి పొందిన కార్యదర్శులకు సహచర ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

వెలుగుబంటి ట్రస్ట్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - కడియం : స్థానిక వెలుగుబంటి రామచంద్ర రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలుముందు సుమారు 50 రోజులు ప్రతి సాయంత్రం వేళల్లో స్నాక్స్ అందజేయడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి సత్యనారాయణ పేర్కొన్నారు. ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ ఆధ్వర్యంలో ట్రస్ట్ తరపున గతంలో స్నాక్స్ అందించిన విషయాన్ని గుర్తు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం పదో తరగతి విద్యార్థులు 168 మంది పరీక్ష రాస్తున్నారని, మంచి ఫలితాలు సాధించేందుకు వీరిని ప్రతి టీచర్‌కి ఆరుగురు చొప్పున దత్తత ఇచ్చామని, ఉదయం సాయంత్రం సమయాల్లో ఒక గంట అదనపు క్లాసులు జరుగుతున్న విషయాన్ని తెలియజేశారు. ట్రస్ట్ తరపున బిస్కెట్ ప్యాకెట్స్, పాలు అందజేశారు. రామచంద్రరావు ట్రస్ట్ వారికి పాఠశాల తరపున ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలియజేశారు.

రహదారి భద్రతతోనే ప్రమాదాలు నివారణ : ఆర్డీవో

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : రహదారి భద్రత పాటించినప్పుడే ప్రమాదాలు నివారణ సాధ్యపడుతుందని ఏలూరు ఆర్డీవో కృష్ణారావు పిలుపునిచ్చారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఏలూరులోని జిల్లా ఉప రవాణా శాఖ కార్యాలయంలో భారతీయ మంత్రిత్వరోడ్డు రవాణా, జాతీయ రహదారులు శాఖ, మిస్టరీ ఆఫ్ యూత్ అఫైర్స్, నెహ్రూ యువ కేంద్రం సమన్వయంతో రహదారి భద్రతపై ఒకరోజు వాలంటీర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ ఎస్సి.శేఖర్, ఏఎంవిఐలు ఎండి.జమీర్, పి.నరేంద్రబాబు, డి.ప్రజ్ఞ, ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఇటీవల కాలంలో రోడ్డు మరణాలు అధికంగా నమోదు అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలు జరగడానికి ముఖ్యంగా నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగమే కారణమని స్పష్టం చేశారు. కొద్దిపాటి ఆలస్యంతో ప్రమాదాలు నివారించవచ్చనే విచక్షణను వాహనదారులు కోల్పోయి మితిమీరిన అతివేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నారన్నారు. వాహనదారులు ప్రమాదాల నివారణకు విధిగా హెల్మెట్ ధరించడంతో పాటు సీట్ బెల్ట్ ధరించడం వల్ల సాధ్యమైనంత వరకు ప్రాణాపాయ స్థితి నుండి బయట పడతారని ఆర్డీవో సూచించారు. వాహదారులు డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు సరైన ద్రవీకరణ పత్రాలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నడిపే వాహనాలపై రవాణా శాఖ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర -తణుకు: తణుకు కేంద్ర జిల్లా ప్రభుత్వాసుపత్రి 150 పడకల స్థాయి కనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించి కార్మికుల పనిభారం తగ్గించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు కోరారు. బుధవారం తణుకు కేంద్ర జిల్లా ప్రభుత్వాసుపత్రి కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఆసుపత్రి అభివృద్ధి సంఘ సమావేశానికి విచ్చేసిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిలకు కోనాల వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లడుతూ తణుకు ఏరియా హాస్పిటల్ గా వున్న సమయంలో నియమించిన 19 మందితోనే విధులు నిర్వర్తిస్తున్నారని 150 పడకలకనుగుణంగా కనీసం మరో 50 మంది పారిశుధ్య కార్మికుల

నియామకం చేపట్టి వలసి వుందన్నారు. ప్రస్తుత కాంట్రాక్టర్ ఫస్ట్ ఆబ్జెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సుమారు 27 నెలలుగా కార్మికుల ఖాతాల్లో పిఎఫ్ సొమ్ము జమ చేయడం లేదన్నారు. నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. 150 పడకల ఆసుపత్రి స్థాయి కనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించాలని, పిఎఫ్ సక్రమంగా జమ చేయాలని, నాలుగు నెలల వేతన బకాయిలు చెల్లించాలని భీమారావు కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి : కలెక్టర్

విశాలాంధ్ర - జగ్గంపేట, కిర్లంపూడి : ప్రభుత్వ కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదేశించారు. నియోజకవర్గంలోని కిర్లంపూడి, జగ్గంపేట మండలాల్లో ఆయన బుధవారం సుడిగాలి పర్యటన పర్యటన చేశారు. తొలుతగా కిర్లంపూడి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. తదుపరి మండలంలోని బూరుగుపూడిలో సచివాలయం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం జగ్గంపేట మండలంలోని మామిడాడలో గోకులం షెడ్డును ప్రారంభించి, కాండ్రేగులలో ఉపాధి హామీ పథకంలో పనిచేసిన చెరువును పరిశీలించారు. తదుపరి మండల కేంద్రంలో ఉన్న పశు వైద్యశాలను తనిఖీ చేసి ఆసుపత్రి అవరణంలోనూ, ప్రక్కనే ఉన్న విద్యా శాఖ కార్యాలయంలోను చెత్త ఉండటంపై వెటర్నరీ ఏడి తాతయ్య, ఎంపిడిఓ ఏవిఎస్ చంద్రశేఖర్ పై మండిపడ్డారు. గత శనివారం పరిసరాలను ఎందుకు

శుభ్రపరచలేదని ప్రశ్నించారు. వెటర్నరీ సిబ్బంది 12 మందితో పరిసరాలను శుభ్రపరచాలని ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గాల పర్యటనలో భాగంగా ఇక్కడకు రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జెవిఆర్ రమేష్, ఐసిడిఎస్ సిడిపిఓ ఎమ్ పూర్ణిమ, పంచాయతీ రాజ్ డిఈ ఉమా శంకర్, మండలంలోని అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం జయప్రదం చేయండి

విశాలాంధ్ర - రాజానగరం : కోరుకొండ మండలంలోని బురుగుపూడి వద్ద ఏర్పాటు చేసిన నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ క్యాంప్ కార్యాలయంలో నేడు జరగనున్న రక్తదాన శిబిరాన్ని ప్రతిఒక్కరు జయప్రదం చేయాలని రాజమండ్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్(రుడా)మరియు రాజానగరం నియోజ కవర్గ ఇన్చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రివర్యులైన నారా లోకేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం, కేక్ కటింగ్ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయ్యాలని తెలిపారు.

ఆదిత్యలో ఫౌండేషన్ ఆఫ్ టీచింగ్ అండ్ లెర్నింగ్ ప్రారంభం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం ఆదిత్య యూనివర్సిటీ ఫ్రెష్ మ్యాన్ ఇంజనీరింగ్ విభాగంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ వారి సౌజన్యంతో ఫౌండేషన్ ఆఫ్ టీచింగ్ అండ్ లెర్నింగ్ అనే అంశంపై 5 రోజుల ప్రొఫెషనల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఘనంగా ప్రరమైనట్లు ఆదిత్య డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాస రెడ్డి తెలిపారు. ప్రస్తుతం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న డిజిటల్ ప్రపంచానికి అనుగుణంగా ఉపాధ్యాయ వృత్తిలో అవసరమైన మెళకువలు, విద్యార్థుల మానసిక స్థితికి అనుగుణంగా అధ్యాపకులు వారి వృత్తి నైపుణ్యాలు అభివృద్ధి చేసుకొనుటకు ఇటువంటి ప్రోగ్రాంలు ఎంతో అవసరం అని డా శ్రీనివాస రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా ఎంబి శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకడమిక్స్) డా ఎస్ రమాశ్రీ, రిజిస్ట్రార్ డా జి సురేష్, అసోసియేట్ డీన్ డా ఏ వానతి, కో ఆర్డినేటర్ డా పి సతీష్ ఇతర విభాగాధిపతులు డా ఎన్ సెల్వమలార్, డా జి చిన్నారాం, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాస్ పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండల మహిళా సమైక్య వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ పై అవగాహన సదస్సు ఎంపీడీవో ఎంవిఆర్ కుమార్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ జీకే సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఉల్లాస్ వయోజన విద్య ఆవశ్యకతను వివరించారు.ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా మండలంలో 650 మహిళ నిరక్షరాస్యత కలిగిన వారిని 65 సెంటర్ల ద్వారా 55 రోజుల్లో అక్షరాస్యులుని చేసే కార్యక్రమంలో మీరు స్వచ్ఛందగా భాగస్వాములు అవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్డి యాంకర్ అనిల్ కుమార్ వయోజన విద్య నోడల్ అధికారి వెంకటరెడ్డి, మండల వెలుగు ఏపిఎం వై వెంకట్, వెలుగు సీసీలులు మరియు డ్వాక్రా యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్పీజీ డీలర్లకు నోటీసులు

ఆరోపణ రుజువైతే డీలర్లను బ్లాక్ లిస్టులో పెడతాం: జేసీ

విశాలాంధ్ర- ఏలూరు : జిల్లాలో దీపం పథకం లబ్ధిదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారించి 17 మంది ఎల్పీజీ డీలర్లకు నోటీసులు జారీ చేసినట్లు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో బుధవారం దీపం పథకం అమలుపై జిల్లాలోని గ్యాస్ డీలర్లు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, పౌర సరఫరాల శాఖ అధికారులతో జెసి ధాత్రిరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీపం పథకంపై లబ్ధిదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారణలో రుజువైతే ఆయా గ్యాస్ ఏజెన్సీలపై తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సంబంధిత ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టి వారి లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. లబ్ధిదారులు దీపం 2 ఉచిత గ్యాస్ పథకం కింద చెల్లించాల్సిన అసలు బిల్లుకు అదనంగా రూ.80 నుండి రూ.150 వరకు కొన్ని గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్ లు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని అటువంటి చర్యలకు పాల్పడితే సంబంధిత గ్యాస్ ఏజెన్సీ డీలర్లు బాధ్యత వహించాల్సి వుంటుందని హెచ్చరించారు. గ్యాస్ ఏజెన్సీలు అదనంగా

డబ్బులు వసూలు చేసినట్లయితే, మార్కెటింగ్ కంపెనీ సేల్స్ అధికారికి, మండల తహసీల్దార్/పౌర సరఫరాల తహశీల్దార్ లేదా జిల్లా పౌర సరఫరాల అధికారికి ఫిర్యాదు చేయాలని లేదా టోల్ ఫ్రీ నెం 18004256453/1967 టోల్ ఫ్రీ నెంబర్లుకి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రతీ గ్యాస్ కంపెనీ డెలివరీ సమయంలో 'హ్యాండిల్ వేయింగ్ స్కేలు' వినియోగదారుని వద్దకు తీసుకువెళ్లాని జెసి ఆదేశించారు. జిల్లాలో అర్హులైన దీపం 2 పథకం లబ్ధిదారుల డేటా ఈకెవైసి, ఆధార్ సీడింగ్, బ్యాంకు లింకింగ్, ఇతర రైసు కార్డు సమస్యలను ఎప్పటి కప్పుడు తెలుసుకొని సమస్యలను త్వరితగతిన పరిష్కరించి వారి ఖాతాలో సబ్సిడీ పడేటట్లు చూడాలని డిఎస్ఓను ఆదేశించారు. సమావేశంలో డిఎస్ఓ ఆర్ఎస్ఎస్.సత్యనారాయణ రాజు, హెచ్ పిసిఎల్ ఎం.వెంకటేశ్వర్లు, ఐఓసిఎల్ ప్రసాద్, తూనికల కొలతల ఇన్స్పెక్టర్, పౌర సరఫరా డిప్యూటీ తహశీల్దార్లు, జిల్లాలో గల గ్యాస్ డీలర్లు అందరూ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి :ప్రకాష్ బాబు

విశాలాంధ్ర - రాజానగరం : వినియోగదారులు ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలనీ, తద్వారా ప్రయోజనాలు మన వెంటే ఉంటాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్ బాబు పేర్కొన్నారు. మండల కేంద్రమైన రాజానగరంలోని ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ (డిఎల్ఎస్ఏ)ఆధ్వర్యంలో బుధవారం జరిగిన వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సుకి ముఖ్య అతిథిగా విచ్చేసిన న్యాయమూర్తి ప్రకాష్ బాబు మాట్లాడుతూ వస్తువు కొనుగోలు చేసే సమయంలోనే నాణ్యత ప్రమాణాలు పరిశీలించాలన్నారు. బిల్లు తప్పకుండా తీసుకోవాలన్నారు. మోసపోతే కన్స్యూమర్ కమిషన్లో కేసు నమోదు చేసి సత్వర న్యాయం పొందవచ్చన్నారు. సదస్సు అధ్యక్షులు డిఎల్ఎస్ఏ, డిసిపిసి సభ్యులు గొట్టిముక్కల అనంతరావు మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం–2019లో ఈ కామర్స్, మీడియేషన్, వీడియో కాన్ఫరెన్సింగ్ తదితర అంశాలు ఇందులో క్రోడీకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో జెవి. ఝాన్సీ రాణి, తహశీల్దార్ జి.ఏఎల్ సత్యవతిదేవి, డిఎల్ఎస్ఏ సభ్యులు గొట్టిముక్కల అనంతరావు, సబ్ ఇన్స్పెక్టర్ కె.వెంకట నాగార్జున, ఎంపీడీవో, రెవిన్యూ, ఐసిడిఎస్, విద్యాశాఖ అధికారులు, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.